ANN తెలుగు

Follow: @ANNTELUGU

06-09-2025

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 273 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



### ప్రధాని మోదీతో ఏపీ మంత్రి
## నారా లోకేశ్ భేటీ
### 45 నిమిషాల పాటు చర్చలు
ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల స్థాపనకు చేయూత అందించాలని విజ్ఞప్తి

**ఢిల్లీ, మహా :** ప్రధాని నరేంద్ర మోదీతో ఏపీ మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. కేంద్ర సాయం, పెండింగ్ ప్రాజెక్టులు, కేంద్ర పథకాల అమలు, తాజా రాజకీయ పరిస్థితులపై ప్రధానితో ఆయన చర్చించారు. సుమారు 45 నిమిషాల పాటు ఈ భేటీ సాగింది. రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు సహకారం అందించాలని ప్రధానిని లోకేశ్ కోరారు.


మిగతా 2లో

**టాప్ న్యూస్**



భారత్, రష్యాలను
### చైనాకు కోల్పోయాం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్వేదం

02



హైదరాబాద్‌లో
### సీబీఐ డైరెక్టర్
- కాళేశ్వరంపై విచారణ

02



### కవితక్క అప్‌డేట్స్
- హంపి కుట్ర బట్టబయలు
- కమలాన్ని మొలకెత్తించాలనుకున్న కారు ఓనర్లు

02



# నేనూ రెండోసారి సీఎం అవ్వాలనుకుంటున్నా..



### మీరు బాగా పనిచేస్తే కేజ్రీవాల్‌లా రెండోసారి అయిత
మీతో పాటు నేనూ కష్టపడతా .. విద్యాభివృద్ధి కోసం ఎక్కడికైనా వస్తా

ఏటా 200 మంది టీచర్లను అధ్యయనానికి విదేశాలకు పంపిస్తా

గురుపూజోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

కాళేశ్వరం కూలిందని.. బీఆర్ఎస్ ను రద్దుచేశారా?

ఏదో తప్పు జరిగిందని రెవెన్యూ వ్యవస్థను రద్దు చేయడం దుర్మార్గం

5వేలమందికి కొలువులపండుగలో నియామకపత్రాలు

**హైదరాబాద్, మహా :** విద్యారంగాన్ని గత ప్రభుత్వం వ్యాపారంగా మార్చుకుందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. గత ప్రభుత్వంలో నూతన నియామకాలు లేవని ఆరోపించారు. గొప్ప చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీ మూతపడే పరిస్థితికి వచ్చిందన్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్ శిల్పకళావేదికలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుపూజోత్సవ కార్యక్రమానికి రావడం సంతోషంగా ఉందన్నారు. విద్యాశాఖ అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని, విద్యాశాఖను స్వయంగా పర్యవేక్షిస్తూ ప్రతిసమస్యను పరిష్కరిస్తున్నానని చెప్పారు.

మిగతా 3లో



## మహా నిమజ్జనం.. సర్వం సిద్ధం
### 50 వేల విగ్రహాలు.. 30 వేల పోలీసులు
ఖైరతాబాద్ మహా గణేశున్ని దర్శించుకున్న ముఖ్యమంత్రి

**హైదరాబాద్, మహా :** ఖైరతాబాద్ మహా గణపతిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ విఘ్నేశ్వరుడి కృప ప్రజలందరిపైనా ఉండాలని ప్రార్థించారు. మరోవైపు బొజ్జగణపయ్య నిమజ్జనోత్సవానికి మహానగరం హైదరాబాద్ ముస్తాబైంది. మహా నగరంలో గణేశ్ నిమజ్జనాన్ని అంగరంగవైభవంగా నిర్వహించేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. రూ.54 కోట్లతో నగరవ్యాప్తంగా నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో మౌలిక సదుపాయలు కల్పించింది.

మిగతా 2లో

## మళ్లీ రేవంత్ రెడ్డే సీఎం..
- ఆయన నాయకత్వంలోనే ఎన్నికలకు
- లోకల్ బాడీ కంటే ముందే నామినేటెడ్ పోస్టులు భర్తీ
- కామారెడ్డిలో బహిరంగ సభ
- రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి విషయంలో హైకమాండ్ దే నిర్ణయం
- మీడియా చిట్ చాట్ లో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు

02



## బీఆర్ఎస్ పార్టీకి కేసీఆరే సుప్రీం
### ఎవరి విషయంలో అయినా నిర్ణయం పార్టీది, ఆయనదే...
- కలిసికట్టుగా పని చేయడం, ప్రజలకు సేవ చేయడమే నేర్పించారు
- కవితపై మాజీ మంత్రి హరీష్ రావు పరోక్ష విమర్శలు
- లండన్‌లో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో హరీష్ రావు

**మహా:** బీఆర్ఎస్‌కు సుప్రీం కేసీఆర్ అని.. ఎవరి విషయంలో అయినా నిర్ణయం పార్టీదేనని బీఆర్ఎస్ ముఖ్యనేత, మాజీమంత్రి హరీష్ రావు స్పష్టం చేశారు. తనపై కల్వకుంట్ల కవిత

మిగతా 2లో






## యువ రాష్ట్రం ప్రపంచంతో పోటీ
### 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు అడుగులు
- విద్యారంగంపై ఎవరూ ఊహించని రీతిలో పెట్టుబడి పెట్టాం: భట్టి
- మోతిలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభించిన డిప్యూటీ సీఎం



**హైదరాబాద్, మహా:** మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు తెలంగాణ రాష్ట్రం వేగంగా అడుగులు వేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో మోతిలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. యువ రాష్ట్రం ప్రపంచంతో పోటీపడుతోందని, రాష్ట్ర అభివృద్ధి కోసం ఐఎస్‌బీ విద్యార్థులు సహకరించాలని కోరారు. ప్రభుత్వం విద్యారంగంపై ఎవరూ ఊహించనిరీతిలో పెట్టుబడులు పెడుతుందని తెలిపారు. విద్యపై పెట్టుబడి రాష్ట్ర ప్రగతికి ఉపయోగపడుతుందని, ప్రజా ప్రభుత్వం సంపూర్ణంగా విశ్వసిస్తుందని చెప్పారు.

మిగతా 2లో



# మహా నిమజ్జనం.. సర్వం సిద్ధం

## 50 వేల విగ్రహాలు.. 30వేల పోలీసులు... ఖైరతాబాద్ మహా గణేశున్ని దర్శించుకున్న ముఖ్యమంత్రి



(మొదటిపేజీ తరువాయి)

గణేశ్ ఉత్సవ సమితులతో సమన్వయం చేసుకుంటూ నిమజ్జనం జరిగే హుస్సేన్ సాగర్, ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్, ఎన్టీఆర్ మార్గ్ తోపాటు 20 ప్రధాన చెరువులు, 74 కృత్రిమ కొలనుల వద్ద ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే గ్రేటర్ పరిధిలో దాదాపు లక్షా 50 వేల విగ్రహాలు నిమజ్జనం కాగా.. శనివారం ఖైరతాబాద్, బాలాపూర్ గణేశ్‌లతో సహా దాదాపు 50 వేలకుపైగా విగ్రహాలు నిమజ్జనం కానున్నాయి. ఇందుకోసం జీహెచ్ఎంసీ, పోలీసు, రెవెన్యూ, విద్యుత్ సహా వివిధ శాఖలతో ప్రభుత్వం పక్కాగా ఏర్పాట్లు చేసింది. 15 వేల మంది సిబ్బందితో గణేశ్ నిమజ్జనానికి సిద్ధమైన బల్దియా... 134 క్రేన్లు, 259 మొబైల్ క్రేన్లు ఏర్పాటు చేసింది. హుస్సేన్ సాగర్ చుట్టూ నిమజ్జనం సాఫీగా, వేగంగా జరిగేలా 11 పెద్ద క్రేన్లతో సహా 40క్రేన్‌లను భక్తులకు అందుబాటులో ఉంచింది. ఎన్టీఆర్ మార్గ్ లోని క్రేన్ నెంబర్ 4 వద్ద ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం జరగనుండగా... ట్యాంక్ బండ్ వైపు ఏర్పాటు చేసిన క్రేన్ వద్ద బాలాపూర్ గణేశ్ నిమజ్జనం చేయనున్నారు. పోలీసు శాఖ సహకారంతో 13 కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసి నిమజ్జానికి తరలివచ్చే భక్తులు, సందర్శకులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా చూసేలా ఏర్పాట్లు చేశారు. దాదాపు 30వేల మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు.

**ఖైరతాబాద్ గణపతికి సీఎం రేవంత్ ప్రత్యేక పూజలు**

ఖైరతాబాద్ మహా గణపతిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ విఘ్నేశ్వరుడి కృప ప్రజలందరిపైనా ఉండాలని ప్రార్థించారు. హైదరాబాద్ నగర చరిత్రలో గడిచిన 71 సంవత్సరాలుగా ఎన్ని ఇబ్బందులు, కష్టాలొచ్చినా దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా ఖైరతాబాద్ బడా గణేష్ ఉత్సవాలను జరుపుతున్నారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నిర్వాహకులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలను ఒకసారి చేయడమే కష్టమవుతున్న ఈ కాలంలో ఎన్ని ఉపద్రవాలొచ్చినా తట్టుకుని నిలబడి నిర్వహిస్తున్న ఖైరతాబాద్ గణపతికి పోటీ లేదన్నారు. హైదరాబాద్‌లో 1 లక్షా 40 వేల విగ్రహాలను ప్రతిష్టించుకుని ఉత్సవాలను అత్యంత వైభవంగా జరుపుకుంటున్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని చెప్పారు. భక్తుల మనోభావాలను గౌరవించే విధంగా నగరంలో పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, ఇతర శాఖలు తోడ్పాటును అందిస్తున్నాయని చెప్పారు. అన్ని మతాలను గౌరవిస్తూ హైదరాబాద్ నగరం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ట్యాంక్‌బండ్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని, ప్రజలంతా భక్తి శ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమం పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు.



### భారత్, రష్యాలను చైనాకు

# కోల్పోయాం

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్వేదం

**మహా:** చైనా కారణంగా భారత్ కు దూరమయ్యామని అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ అన్నారు. శుక్రవారం నాడు సోషల్ మీడియాలో ఆయన ఈ మేరకు పోస్టు పెట్టారు. భారత్ తో పాటు రష్యా కూడా అమెరికాకు దూరమైందని ఆయన ఆ పోస్టులో తెలిపారు. భారత్, రష్యా, చైనా బంధం దీర్ఘకాలం భాగ్యవంతంగా కొనసాగాలంటూ వ్యంగ్యంగా క్యాప్షన్ పెట్టారు. కుట్ర బుద్ధి ఉన్న చైనాకు ఈ రెండు దేశాలు దగ్గరయ్యాయని ఆయన తన అసహనాన్ని వ్యక్తం చేశారు. చైనా చీకటి వలయంలో ఈ రెండు దేశాలు చిక్కుకున్నాయని ఆయన అన్నారు. మోడీ, పుతిన్, జిన్ పింగ్ ఇటీవల కలుసుకున్న ఫోటోను షేర్ చేసి ఆయన ఈ వ్యాఖ్యలను తన ట్రూత్ పోస్టులో పోస్టు చేశారు. ఈ ముగ్గురు నేతలకు మంచి భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నానని ఆయన అన్నారు.

# యువ రాష్ట్రం ప్రపంచంతో పోటీ

## 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు అడుగులు

- విద్యారంగంపై ఎవరూ ఊహించని రీతిలో పెట్టుబడిపెట్టాం: భట్టి
- మోతిలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభించిన డిప్యూటీ సీఎం



(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను పూర్తి ఉచితంగా అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభిస్తున్నామని తెలిపారు. 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్ల పెట్టుబడితో ఒక్కో పాఠశాల నిర్మిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 104 పాఠశాలల నిర్మాణం ప్రారంభించినట్లు వివరించారు.

**రేవంత్ రెడ్డి నిరంతరం నేర్చుకోవడానికి ఇష్టపడతారు..**

విద్యార్థులు కళాశాల విద్య పూర్తి చేసుకొని బయటకు వెళ్లగానే ఉద్యోగం పొందేలా స్కిల్ యూనివర్సిటీలో సిలబస్ రూపొందించి అమలు చేస్తున్నట్టు భట్టి విక్రమార్క తెలిపారు. స్కిల్ యూనివర్సిటీలో సిలబస్ ఎలా ఉండాలి అనేది పారిశ్రామికవేత్తలతో మాట్లాడి రూపొందిస్తామని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం నేర్చుకోవడానికి ఇష్టపడతారని, రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఐఎస్‌బీలో 5 రోజులపాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం రూపొందించి అమలు చేయాలని నిర్వాహకులను డిప్యూటీ సీఎం కోరారు. 'నా బాల్యం, తెలుగు మాధ్యమం పాఠశాల, ఒకే గురువు, పలకలు కూడా లేక ఇసుకపై అక్షరాలు.. అక్కడి నుంచి ఇవాళ డిప్యూటీ సీఎం వరకు నా ప్రతి అడుగులో గురువుల ఆశీస్సులే. తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ పేరిట మహిళా విశ్వవిద్యాలయం రూ. కోట్ల పెట్టుబడితో ఆధునికతకు ప్రతీక. విద్య అనేది కేవలం ప్రొఫెషనల్స్ కోసం కాదు, మానవత్వం కోసం నాయకులను తీర్చిదిద్దే సాధనమని మా సంకల్పం' అని చెప్పారు.




# ఈసారి డబుల్

- **రేవంతన్న బతుకమ్మ కానుక..**
- **మహిళలకు పండుగ కానుకగా రెండు చీరలు**
- **'ఇందిరా మహిళా శక్తి' పేరుతో సెప్టెంబర్ 22 నుంచి 30 వరకు డిస్ట్రిబ్యూషన్**
- **ఒక్కో చీర రూ.800 విలువ.. ఎక్స్‌లో వెల్లడించిన కాంగ్రెస్ పార్టీ**
- **ఈ పథకానికి రూ.318 కోట్లు కేటాయించిన కాంగ్రెస్ సర్కార్**

**హైదరాబాద్, మహా:** సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళలకు బతుకమ్మ పండుగ కానుకగా చీరల పంపిణీకి నిర్ణయించింది. పండుగ పూట తెలంగాణ ఆడబిడ్డల కళ్ళల్లో ఆనందం నింపే "రేవంతన్న బతుకమ్మ కానుక" గా రెండు చీరలను పంపిణీ చేయనుందని కాంగ్రెస్ పార్టీ ఎక్స్ లో పేర్కొంది. "ఇందిరా మహిళా శక్తి చీరలు" పేరుతో గౌరవం, సంతోషం, స్వాభిమానానికి ప్రతీకగా ప్రతి మహిళకు రెండు నాణ్యమైన చీరలను పంపిణీ చేయాలని నిర్ణయించినట్లుగా వెల్లడించింది. ఒక్కో చీర రూ.800 విలువైనదని పేర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ప్రభుత్వం 65 లక్షల చీరలను సెప్టెంబర్ 22నుంచి 30వరకు పంపిణీ చేయనున్నట్లుగా తెలిపింది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఆడబిడ్డల బతుకమ్మ వేడుకలకు కొత్త వెలుగు నివ్వడంతో పాటు 6000 మంది చేనేత కార్మికులకు ఉపాధి కల్పిస్తూ చేనేత రంగాన్ని ప్రజాప్రభుత్వం కాపాడుతుందని పేర్కొంది. ఒకవైపు పండుగ ఆనందం.. మరోవైపు చేనేతకు ఊపిరి.. ఇదే కాంగ్రెస్ ప్రజా సర్కార్ ప్రత్యేకత అని తెలిపింది.

**ఈ పథకానికి రూ.318 కోట్లు..**

'ఇందిరా మహిళా శక్తి' పథకంలో భాగంగా చీరల ఉత్పత్తి ఆర్డర్ ఇవ్వడం ద్వారా సిరిసిల్ల ప్రాంతంలోని నేత కార్మికులకు ఉపాధి లభిస్తోంది. సుమారు 6 వేల మంది కార్మికులు ఈ పనిలో నిమగ్నమై, నెలకు దాదాపు 20 వేల రూపాయలు సంపాదిస్తున్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన "సంవత్సరం పొడుగునా ఉపాధి" హామీ అమలులో భాగంగానే ఈ ఆర్డర్లు ఇచ్చినట్లు ప్రభుత్వం చెబుతోంది. ఈ పథకానికి తెలంగాణ ప్రభుత్వం రూ.318 కోట్లు కేటాయించింది. ప్రారంభంలో కూలీల రేటు ఖరారులో కొంత ఆలస్యం జరిగినప్పటికీ, ఇప్పుడు ఉత్పత్తి పూర్తిస్థాయిలో కొనసాగుతోంది. రోజూ సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ గోడౌన్‌లో వస్త్రం ప్రొక్యూర్ చేసి, హైదరాబాదులో ప్రాసెసింగ్ జరుపుతున్నారు. ఈ మొత్తం ప్రక్రియను చేనేత & జౌళి శాఖ కమిషనర్ శైలజ రామయ్యార్ పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఈసారి బతుకమ్మ పండుగలో మహిళలకు ప్రత్యేక కానుక అందనుంది. గతంలో ఒకటే చీర ఇస్తే, ఈసారి రెండు నాణ్యమైన ఇందిరమ్మ చీరలు ఇవ్వడం ద్వారా పండుగ సంబరాలను మరింత ప్రత్యేకంగా మార్చాలని ప్రభుత్వం యోచిస్తోంది.

## కవితక్క అప్‌డేట్స్

# హంపి కుట్ర బట్టబయలు

## కమలాన్ని మొలకెత్తించాలనుకున్న కారు ఓనర్లు

**హైదరాబాద్, మహా :** కవితక్క అప్ డేట్స్ పేరుతో బీఆర్ఎస్ కీలక నేతల కథలు ఒక్కొక్కటిగా కవిత మద్దతుదారులు బయటపెడుతున్నారు. కీలక నేతలపై రోజుకో లీక్ ఇస్తూ సంచలనాలకు తెరతీస్తున్నారు. గురువారం సంతోష్‌రావుపై అవినీతి ఆరోపణలు అంటూ లీక్స్ ఇవ్వగా.. శుక్రవారం గతంలో బీఆర్ఎస్ నేతల హంపీ టూర్‌పై కీలక విషయాలు వెల్లడించారు. కవితక్క అప్ డేట్స్ ఎక్స్ ఖాతాలో టైం చెప్పి మరీ పోస్ట్ చేస్తున్నారు. హంపీలో కమలాన్ని మొలకెత్తించాలని అనుకున్న కారు ఓనర్లు' పేరుతో సంచలన ఆరోపణలు చేశారు. నేరుగా నేతల పేర్లు ప్రస్తావించకుండా చేసిన ఈ ట్వీట్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాశంగా మారింది. రెండోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లలో నల్గొండ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకుడు ఇస్తున్న పార్టీ అని చెప్పి కొంత మంది గులాబీ నాయకులు హంపీకి వెళ్లారు. అక్కడికి వెళ్లిన సందర్భం వేరే అయినా.. వారు మాట్లాడుకున్నది వేరు అని 'కవితక్క అప్‌డేట్స్' పేరిట ఉన్న 'ఎక్స్' ఖాతాలో వెల్లడించారు. 'కేసీఆర్ తర్వాత కేటీఆర్‌ను సీఎం చేస్తామంటే మేము ఒప్పుకోము. పార్టీకి ఓనర్లం మేమే. కేసీఆర్ కొడుకు కాబట్టి అతడిని సీఎం చేయాలా?' అని కొంత మంది నేతలు చెప్పారని.. ఈ సందర్భంగా పార్టీకి, కేసీఆర్‌కు వ్యతిరేకంగా పాటలు కూడా పాడారని రాసుకొచ్చారు. ఆ తర్వాత పార్టీలో జరిగిన కీలక విషయాలను పోస్టులో వివరించారు. అగ్గిపెట్ట మచ్చ, పార్టీ ఓనర్, ఇతర నాయకులు కలిసి కొత్త పార్టీ పెట్టాలి అని మొదట అనుకున్నా, అది సాధ్యమవుతుందో లేదో అనుమానంతో కమలం పార్టీలోకి వెళ్లాలని ఆ నాయకులు భావించారు. అయితే.. ఒక సీఎం స్థాయి వ్యక్తికి ఇలాంటి కుట్రలు తెలియవు అనుకోవడం వారి తెలివితక్కువతనం. ఈ విషయాలు అన్నీ పూసగుచ్చినట్లు కేసీఆర్‌కి తెలిసినవి. అప్పుడు మెల్లగా మన మచ్చ, కేటీఆర్ దగ్గరకు వచ్చి 'నేను మీ వెంటనే ఉంటా, ఎక్కడికీ వెళ్లను. నువ్వే ఏదైనా చేసి ఒప్పించాలి. నేను ఏం చేయలేదు. మొత్తం పార్టీ ఓనర్ చేశాడు' అని చెప్పారు. పాపం పార్టీ ఓనర్‌ను తన స్వార్థం కోసం బలిచేశాడు. ఇలాగే చెప్పితే నమ్ముతారో లేదో అని, తన వద్దకు వచ్చిన ఒక సింగర్ నాయకుడి రికార్డింగ్ కూడా ఇచ్చాడు. తనకు మంత్రి పదవి ఇచ్చినా, కేవలం అమలు చేయడం వరకే పరిమితం చేశారు. ఎక్కడ ఎంతవరకు ఉంచాలో, అక్కడ వరకే ఉంచారు కేసీఆర్. ఇప్పుడు మళ్లీ బీజేపీకి వెళ్తున్నాడని వార్తలు రప్పించుకొని, బ్లాక్‌మెయిల్ చేసి పార్టీలో నంబర్ 3 స్థానం దక్కించుకున్నాడు. కానీ.. అతని దాహం అక్కడితో ఆగలేదు. కేసీఆర్‌కంటే తానే గొప్ప అని, ఒక మేధావి కొంతమంది కూలీలతో చెప్పించుకుంటున్నాడు. ఈ సమావేశంలో నల్గొండకు చెందిన అప్పటి కొంతమంది ఎమ్మెల్యేలు, చంటి, రసమలై, పార్టీ ఓనర్.. తదితరులు ఉన్నారు. వాళ్ల పేర్లు సందర్భం వచ్చినప్పుడు బయట పెడతాం' అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. హంపి టూర్, మాజీమంత్రి జగదీష్ రెడ్డి పార్టీపై అప్పట్లో సోషల్ మీడియాలో చర్చ జరిగింది.

# మళ్లీ రేవంత్ రెడ్డే సీఎం..

## ఆయన నాయకత్వంలోనే ఎన్నికలకు...

లోకల్ బాడీ కంటే ముందే నామినేటెడ్ పోస్టులు భర్తీ

కామారెడ్డిలో బహిరంగ సభ

రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి విషయంలో హైకమాండ్ దే నిర్ణయం

మీడియా చిట్ చాట్ లో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** 'వచ్చే ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోనే ముందుకు వెళ్తాం. ఎమ్మెల్యేలు కోరుకుంటే రేవంత్ రెడ్డే మళ్లీ సీఎం అవుతారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలుపుకొని వెళ్తున్నాం. క్రమశిక్షణ విషయంలోనూ ఎక్కడా రాజీ పడటం లేదు' అని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ ఉన్నది ఉన్నట్లు మాట్లాడుతారని, ఇదే విషయంలో క్రమశిక్షణ తప్పితే చర్యలు మాత్రం ఉంటాయని అన్నారు. రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి విషయంలో పార్టీ హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. కామారెడ్డిలో ఈనెల 15న బహిరంగ సభ ఏర్పాటుకు సీఎం ఆదేశాలతో సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు.

**పదిరోజుల్లో నూతన కమిటీలు..**

గ్రామ, మండల, జిల్లా కమిటీలు వారం, పది రోజుల్లో నూతన కమిటీలు ఏర్పాటు చేయబోతున్నట్లు మహేశ్ కుమార్ తెలిపారు. 'లోకల్ బాడీ కంటే ముందే నామినేటెడ్ పోస్టులు భర్తీ ఉంటుంది. సంక్షేమ పథకాల విషయంలో చేతివాటం ఎవరు చూపించిన కఠిన చర్యలు ఉంటాయి. అజారుద్దీన్ ఎమ్మెల్సీగా ప్రకటించడం క్యాబినెట్ నిర్ణయం' అని తెలిపారు. అప్పుడే మాట్లాడితే కవితకు సెల్యూట్ చేసేవాడిని.. నేరెళ్ల ఘటనపై కవిత అప్పుడే మాట్లాడితే సెల్యూట్ చేసేవాడిని అని మహేశ్ కుమార్ తెలిపారు.

**బీఆర్ఎస్ చచ్చిన పాము..**

బీఆర్ఎస్ పార్టీ చచ్చిన పాము లాంటిది. బీఆర్ఎస్ పార్టీలో కుటుంబ తగాదాలు జరుగుతున్నాయి. కవిత.. హరీష్‌రావు, సంతోష్‌రావు అవినీతి గురించి బయట పెట్టింది. కేసీఆర్ కుటుంబంలో మంచి లక్షణాలు ఉన్నాయి. అబద్ధాన్ని నిజం లాగా చెప్తారు. బీసీ రిజర్వేషన్లు బీసీ బిడ్డలకు నోటి దాకా వచ్చి ఆగడానికి కిషన్ రెడ్డి కారణం. బీజేపీ బీసీ నాయకులు ఎవరు కూడా మాట్లాడటం లేదు. కాళేశ్వరం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటే కక్ష్య పూరిత చర్యలు అంటారని సీబీఐకి ఇచ్చాం. సీబీఐ ఈ విషయంలో అయినా నిష్పక్షపాతంగా పనిచేస్తుంది అనుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వం వైఫల్యం కారణంగానే తెలంగాణకు యూరియా రాలేదు. రాష్ట్రంలో యూరియా కొరత లేదు. దొరకదు అనే అనుమానంతో రైతులు ఎక్కువగా తీసుకుని వెళ్తున్నారు. యూరియా కొరతను రాష్ట్ర ప్రభుత్వం కవర్ చేస్తుంది' అని టీపీసీసీ అన్నారు.



### ప్రధాని మోదీతో ఏపీ మంత్రి

# నారా లోకేశ్ భేటీ

## 45 నిమిషాల పాటు చర్చలు

ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల స్థాపనకు చేయూత అందించాలని విజ్ఞప్తి



(మొదటిపేజీ తరువాయి)

ఏపీలో సెమీ కండక్టర్ యూనిట్ మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల స్థాపనకు చేయూత అందించాలని విజ్ఞప్తి చేశారు. విద్యాప్రమాణాల మెరుగుదలకు రాష్ట్ర విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నామని.. ఉన్నతవిద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు సహకారం అందించాలని కోరారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 15నెలలుగా కేంద్రం సహకారంతో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తున్నామని చెప్పారు. జీఎస్టీ సంస్కరణల ద్వారా దేశంలోని కోట్లాది పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించిన ప్రధాని మోదీకి మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో గత కొంతకాలంగా నెలకొన్న వివిధ పరిణామాలను ఆయన వివరించారు. ప్రధాని స్పందిస్తూ.. రాష్ట్రాభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందిస్తామని చెప్పారు. యోగాంధ్ర నిర్వహణపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను ఈ సందర్భంగా ప్రధానికి లోకేశ్ బహుకరించారు. ఏపీలో తాజాగా చర్చల్లో ఉన్న లిక్కర్ కేసుకు సంబంధించిన వివరాలను కూడా ప్రధానికి వివరించినట్లు సమాచారం.



### హైదరాబాద్‌లో

# సీబీఐ డైరెక్టర్

## కాళేశ్వరంపై విచారణ

**మహా:** కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారాన్ని సీబీఐకి అప్పగిస్తున్నామని ఇటీవల సీఎం రేవంత్ ప్రకటించడంతో పాటు రాష్ట్రసర్కారు సీబీఐకి లేఖ రాయగా, శుక్రవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. తాజాగా సీబీఐ డైరెక్టర్ ప్రవీద్ సూద్ హైదరాబాద్‌కు వచ్చారు. కోఠి సీబీఐ కార్యాలయంలో అధికారులతో భేటీ అయ్యారు. ఇపుడు సీబీఐ అధికారి ప్రవీణ్ సూద్ హైదరాబాద్ రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. 2గంటలకు పైగా అధికారులతో చర్చించినట్లు తెలిసింది. కాళేశ్వరం కోసం వచ్చారా? ఇతర కేసుల కోసం వచ్చారా? అన్నదానిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. సీబీఐ డైరెక్టర్ అయిన ప్రవీణ్ సూద్ కర్ణాటక కేడర్‌కు చెందిన 1986 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం ఈయన కర్ణాటక డైరెక్టర్ జనరల్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2023 మే 25న సీబీఐకి కొత్త డైరెక్టర్‌గా నియామకం అయ్యారు. మరో రెండేళ్ల పాటు ఆయనే ఈ పదవిలో కొనసాగనున్నారు.

# బీఆర్ఎస్ పార్టీకి కేసీఆరే సుప్రీం

## ఎవరి విషయంలో అయినా నిర్ణయం పార్టీది, ఆయనదే...

- కలిసికట్టుగా పని చేయడం, ప్రజలకు సేవ చేయడమే నేర్పించారు
- కవితపై మాజీ మంత్రి హరీష్ రావు పరోక్ష విమర్శలు
- లండన్‌లో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో హరీష్ రావు



(మొదటిపేజీ తరువాయి)

చేసిన సంచలన ఆరోపణలపై మాజీ మంత్రి హరీష్ రావు పరోక్షంగా స్పందించారు. కలిసికట్టుగా పనిచేయడం.. ప్రజలకు సేవ చేయడమే కేసీఆర్ తమకు నేర్పించారని చెప్పారు. లండన్‌లో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్న హరీష్ రావు.. ఎన్ఆర్ఐ యూకే బీఆర్ఎస్ ఫ్యామిలీ మెంబర్స్‌తో ముచ్చటించారు. ఎన్నారై సెల్ చైర్మన్ అనిల్ కుర్మాచలం లేని లోటు కనిపిస్తోందని, 201213 లో తాను మొదటిసారి వచ్చినప్పుడు అనిల్ మొదటి ఎన్ఆర్ఐ మీటింగ్ తనతోనే ఇక్కడ ఏర్పాటు చేశారని గుర్తు చేసుకున్నారు. ఎన్ఆర్ఐ టీఆర్ఎస్ పార్టీ మొదట పుట్టిందే లండన్‌లోనేనని.. యూకే ఎన్నారైల వల్లే ప్రపంచవ్యాప్తంగా టీఆర్ఎస్ పార్టీ వ్యాప్తి చెందిందని అన్నారు. 'కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అనేక అద్భుతాలు సాధించింది. అప్పుడు దేశంలో నానుడి ఉండేది. బెంగాల్ ఆచరిస్తుంది దేశం అనుసరిస్తుంది అని ఉండేది.. కానీ కేసీఆర్ పాలనతో తెలంగాణ ఆచరిస్తుంది దేశం అనుసరిస్తుంది అనే కాడికి తెచ్చాం.. గత పదేళ్లలో గూగుల్‌లో సెర్చ్ చేసినా మీకు తెలుస్తుంది. పర్ క్యాపిటా ఇన్‌కమ్‌లో తెలంగాణ రాష్ట్రం దేశంలో అగ్రగామిగా ఉంది. పర్ క్యాపిటా పవర్ వాడకంలో ఇండియాలో తెలంగాణ టాప్. జీఎస్డీపీ గ్రోత్‌లో తెలంగాణ రాష్ట్రానికి దరిదాపులో కూడా ఏ రాష్ట్రం లేదు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు నల్ల ద్వారా అందించింది కేసీఆర్. మేనిఫెస్టోలో పెట్టుకోకపోయినా ఇంటికి తాగునీరు అందించిన గొప్ప నాయకుడు కేసీఆర్. అసెంబ్లీలో వచ్చే ఎన్నికల నాటికి ప్రతి ఇంటికి నల్ల ద్వారా నీళ్లి కపోతే ఓట్లు అడగను అని చెప్పిన గొప్ప నాయకుడు కేసీఆర్. మిషన్ భగీరథ కార్యక్రమంతో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించి చూపించారు. తెలంగాణ రాకముందు హైదరాబాదులో ఇండస్ట్రీస్‌కి పవర్ హాలిడేస్ ఇచ్చేవారు. 4 గంటలకు కరెంటు కట్టు ఉండేది.

**కేసీఆర్ రైతుబంధు**

గ్రామీణ ప్రాంతంలో 6 గంటల నుంచి 8 గంటల పవర్ కట్ ఉండేది. అరవై ఏళ్లలో కాని పనిని కేసీఆర్ ఒక్క సంవత్సరంలో సాధించి 24 గంటల నాణ్యమైన కరెంటును ఇచ్చారు. టీఆర్ఎస్ గవర్నమెంట్ ఉన్నప్పుడు కేసీఆర్ ఉదయం లేవగానే పవర్ పై సమీక్ష చేసి పవర్ కొనుగోలు టైమ్స్ ని చూసేవారు. తర్వాత మిషన్ భగీరథ ప్రోగ్రెస్ చూసేవారు. ఆయన ఫోకస్డ్‌గా పనిచేయడం వల్ల తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. మిషన్ భగీరథను ఆదర్శంగా తీసుకొని సర్దార్ కోచలాని కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. రైతుల కోసం దేశంలోనే నేరుగా నగదు బదిలీ చేసిన ఒకే ఒక కార్యక్రమం రైతుబంధు.. వాచ్‌మెన్ జాబ్ చేసినా పిల్లని ఇస్తారు కానీ రైతు అని అంటే పిల్లని ఇచ్చే పరిస్థితి ఉండేది కాదు. వ్యవసాయం అంటే చిన్నచూపు అయింది. అలాంటి పరిస్థితుల నుంచి కేసీఆర్ రైతుబంధు అని ఒక కార్యక్రమం చేపట్టి.. ప్రతి సంవత్సరం 10000 రూపాయలు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేవారు. 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంటు వ్యవసాయానికి అందించారు.. సాగునీరుని అందించాము దాని ద్వారా వ్యవసాయం లాభసాటిగా మారింది. 2014కి ముందు ఎక్కడ చూసినా రెండు మూడు లక్షలకు మించి ఎకరం ఉండేది కాదు.. ఇప్పుడు తెలంగాణలో ఎక్కడ కూడా 30నుండి 50 లక్షల ఎకరం తక్కువ లేదు.. ఆంధ్రాలో ఒక ఎకరా అమ్మితే తెలంగాణలో పదెకరాలు వచ్చేది అని అనేవారు.. ఇప్పుడు తెలంగాణలో ఒక ఎకరం అమ్మితే ఆంధ్రలో పది ఎకరాలు కొనవచ్చు.. కేసీఆర్ తెలంగాణ ఓ గొప్ప రాష్ట్రంగా అభివృద్ధి జరుగుతున్నది అని చెప్పేవారు. ఈరోజు పాలకులే నెగిటివ్ మైండ్ సెట్‌తో ఉంటే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది. ప్రస్తుతం తెలంగాణలో ఈరోజు అవినీతి విపరీతంగా పెరిగిపోయింది. ఏ శాఖలో చూసిన అవినీతి పెరిగిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కాళేశ్వరం అంటే లక్ష లక్ష కోట్ల రూపాయలు పోయాయని దుష్ప్రచారం చేశారు. మూడు నాలుగు వందల కోట్లలో మేడిగడ్డ రిపేర్ అయిపోతుంది. కానీ లక్ష కోట్లు అని దుష్ప్రచారం చేస్తుంది కాంగ్రెస్. రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల ప్రయోజనాలు దెబ్బ తినే విధంగా రాజకీయాలు చేయకూడదు' అని హరీష్‌రావు హితవు పలికారు.

# నేనూ రెండోసారి సీఎం అవ్వాలనుకుంటున్నా..





- మీరు బాగా పనిచేస్తే కేజ్రీవాల్ లా రెండోసారి అయిత
- మీతో పాటు నేనూ కష్టపడతా .. విద్యాభివృద్ధి కోసం ఎక్కడికైనా వస్తా
- ఏటా 200 మంది టీచర్లను అధ్యయనానికి విదేశాలకు పంపిస్తా
- గురుపూజోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కాళేశ్వరం కూలిందని.. బీఆర్ఎస్ ను రద్దుచేశారా?
- ఏదో తప్పు జరిగిందని రెవెన్యూ వ్యవస్థను రద్దు చేయడం దుర్మార్గం
- 5వేలమందికి కొలువులపండుగలో నియామకపత్రాలు

(మొదటిపేజీ తరువాయి)

విద్యాశాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరముందని, తెలంగాణకు నూతన విద్యా విధానం కావాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు బోధిస్తున్నట్లు చెప్పారు. ''ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల కంటే నాణ్యమైన విద్య అందిస్తామని ప్రతిజ్ఞ చేద్దాం. ఏటా 200 మంది టీచర్లను విదేశాలకు పంపి.. అక్కడి విద్యా విధానం అధ్యయనం చేసేలా ప్రోత్సహిస్తాం. ఢిల్లీలో కేజ్రీవాల్ రెండోసారి సీఎం కావడానికి ఆయన చేసిన విద్యాభివృద్ధే కారణం. నాకూ స్వార్థం ఉంది. టీచర్లు బాగా పని చేస్తే నేనూ రెండోసారి సీఎం అవ్వాలనుకుంటున్నా. మీతోపాటే నేనూ కష్టపడతా. నేను ఫామ్ హౌస్‌లో పడుకుంటా.. మళ్లీ సీఎంను చేయండి అని అనట్లేదు. విద్యాభివృద్ధి కోసం టీచర్లు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తా. ఐటీఐలు అప్‌డేట్ చేసి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌గా మార్చాం. ఏటీసీలో టాటా కంపెనీ కల్పించిన సదుపాయాలు చూస్తే నాకే మతిపోయింది. 140 కోట్ల మంది జనాభా ఉన్న భారత్.. ఒలింపిక్స్‌లో ఒక్క స్వర్ణం సాధించలేదు. దక్షిణ కొరియాలో ఒక్క యూనివర్సిటికి చెందిన వారే 16 స్వర్ణపతకాలు సాధించారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీయండి. వారికి ప్రభుత్వమే అన్ని సదుపాయాలు కల్పిస్తుంది. క్రీడల్లో రాణించిన క్రికెటర్ సిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్ డీఎస్పీ అయ్యారు'' అని రేవంత్ తెలిపారు.

''చాలా చోట్ల కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య అందడం లేదు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయులు క్రియాశీలక పాత్ర పోషించారు. ప్రతి గ్రామానికి జై తెలంగాణ నినాదాన్ని చేరవేసింది ఉపాధ్యాయులే. జయజయహే తెలంగాణ గీతాన్ని ఆలపించేలా చేశారు. రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయులు తమ సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకున్నారు? నేనూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొనే ఈ స్థాయికి వచ్చాను. గతంలో గురుపూజోత్సవం ఎప్పుడైనా జరిగిందా..? అందులో సీఎం పాల్గొన్నారా? తెలంగాణ పునర్నిర్మాణంలో టీచర్ల సహకారం కావాలి. పిల్లలు ఎక్కువ సమయం టీచర్ల వద్దే ఉంటారు. పిల్లలతో కలిసే టీచర్ల మధ్యాహ్న భోజనం చేయాలి. వర్సిటీలకు వీసీలను నియమించడానికి గత ప్రభుత్వానికి తీరిక లేదు. ప్రస్తుతం ప్రభుత్వం, టీచర్ల చొరవతో కొత్తగా 3 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ప్రైవేట్ స్కూళ్ల టీచర్ల కంటే.. ప్రభుత్వ టీచర్లకు నైపుణ్యం ఎక్కువ. వివాదాస్పదమైన విద్యాశాఖ తీసుకోవద్దని నాకు కొందరు సూచించారు. అయినా వినకుండా ఈ శాఖను నా వద్దే ఉంచుకున్నా''అని రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ముఖ్యనేతలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### ధరణి అనే భూతాన్ని భూభారతితో అంతం చేశాం

రెవెన్యూ శాఖలో మెరుగైన సేవల కోసం గ్రామ పాలన అధికారులను నియమించినట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో రెవెన్యూ సిబ్బందిది కీలక పాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో 'కొలువుల పండుగ' కార్యక్రమంలో భాగంగా గ్రామ పాలన అధికారుల(జీపీవో)కు సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ తొలి సీఎం మన బతుకులు మారుస్తారని మనమంతా నమ్మామన్నారు. రెవెన్యూ ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరించిందంటూ గత కేసీఆర్ ప్రభుత్వంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను దోచుకున్నది రెవెన్యూ ఉద్యోగులే అన్నట్లుగా చిత్రీకరించిందని ఆయన విమర్శించారు. భూమికి, తెలంగాణ ప్రజలకు విడదీయరాని అనుబంధం ఉందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. చరిత్రలో భూమి చుట్టు జరిగిన ఉద్యమాలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే పోడు భూముల పంపిణీ చేసిందని గుర్తు చేశారు. గత పాలకులు భూములను కొల్లగొట్టేందుకే ధరణిని తీసుకొచ్చారని ఆరోపించారు. భూ సమస్యలు పరిష్కారం కాకుండా మిమ్మల్ని బలి పశువులను చేశారంటూ ప్రజలను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. ఆ పాపాలు బయటకు వస్తాయనే వీఆర్వో, వీఆర్ఏలను తొలగించారని వివరించారు. ధరణి అనే భూతాన్ని అంతం చేస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చామని.. అందుకు తగ్గట్టుగానే దానిని బంగాళాఖాతంలో కలిపేశామన్నారు. భూములు ఆక్రమించాలనుకున్న వారిని ప్రజలు తరిమికొట్టారని తెలిపారు. భూభారతి చట్టం పక్కాగా అమలు కావాలంటే జీపీవోల పాత్ర కీలకమని ఆయన స్పష్టం చేశారు. ఏదో తప్పు జరిగిందని రెవెన్యూ వ్యవస్థను రద్దు చేశారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. చిన్న తప్పు జరిగితే వ్యవస్థ మొత్తాన్ని రద్దు చేస్తారా? అంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. గత పాలకులు కట్టిన కాళేశ్వరం.. కూలేశ్వరం అయిందని వ్యంగ్యంగా అన్నారు. మరి కాళేశ్వరం కూలినందుకు బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? అంటూ ఆ పార్టీ అగ్రనాయకత్వాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఈ వేదికగా నిలదీశారు.

# ఆరు నెలల్లో ఉప ఎన్నికలు

- పోచారం శ్రీనివాస్ రెడ్డి ఓడిపోవడం ఖాయం
- స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే మరోసారి సుప్రీంకు వెళ్తాం
- పాలన చేతకాని కాంగ్రెస్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు



**గజ్వేల్, మహా:** భారతదేశంలోనే నంబర్ వన్ రాష్ట్రాన్ని బంగారు పళ్లెంలో పెట్టి కాంగ్రెస్ చేతిలో పెట్టామని కానీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలోనూ, గతంలో ఉన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలోనూ ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. దీనికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలని, తమకు పరిపాలన చేతకావడం లేదని, అన్ని కార్యక్రమాలను అమలు చేయలేమని నేరుగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఎర్రవల్లిలోని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాసంలో కేటీఆర్ బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఫిరాయింపులపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, త్వరలో రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని అన్నారు. స్పీకర్ లేదా ఫిరాయింపుదారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా రాబోయే ఆరు నెలల కాలంలో ఉప ఎన్నికలు వస్తాయని ఆయన అన్నారు. ఈ ఎన్నికల్లో బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డి ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే మరోసారి సుప్రీంకోర్టుకు వెళ్తామని కేటీఆర్ హెచ్చరించారు. పోచారం ఎమ్మెల్యే పదవి కూడా పోయే వరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి ఏ పార్టీలో ఉన్నాడో చెప్పుకోలేని దయనీయమైన స్థితిలో ఉన్నారని, కానీ బీఆర్ఎస్‌లో ఉన్న ప్రతి కార్యకర్త గర్వంగా తెలంగాణ తెచ్చిన పార్టీలో ఉన్నామని చెప్పుకోవచ్చని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం 21 నెలల్లోనే ప్రజల నుంచి సంపూర్ణ వ్యతిరేకతను మూటగట్టుకుందని విమర్శించారు. హామీల వైఫల్యం, నమ్మకద్రోహం ఒక కారణం అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటల తీరు, వ్యవహార శైలి మరో ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనపై దృష్టి పెట్టకుండా ప్రతిక్షణం కేసీఆర్ పేరు తలుచుకుంటూ అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వాన్ని నడపడం చేతగాక, గత ప్రభుత్వం అప్పులు చేసిందని కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందని మండిపడ్డారు.

# హైడ్రా పేరు చెప్పి రూ.50 లక్షలు వసూలు!

## హైడ్రా దృష్టికొచ్చిన విషయం

- కమిషనర్ ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు
- ఒకరు హైకోర్టు బార్ కౌన్సిల్ నుంచి తొలగించిన ఓ వ్యక్తి
- ఓ డిజిటల్ మీడియా రిపోర్టర్
- మరో డిజిటల్ మీడియా ప్రతినిధి

**హైదరాబాద్, మహా:** ఇటీవల నగరంలో తరుచు వినిపిస్తున్న పేరు హైడ్రా. అక్రమ కట్టడాల కూల్చివేతకు సంబంధించి హైడ్రా పేరు బాగా హైలైట్ అయ్యింది. దీన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది అక్రమాలకు పాల్పడుతున్నారు.. తమకు హైడ్రా అధికారులు బాగా తెలుసని ఓ మహిళను మోసం చేసిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. హయత్‌నగర్‌లో కొంతమంది ముఠాగా ఏర్పడి హైడ్రా అధికారులతో పనిచేయిస్తామని చెప్పి స్థానిక మహిళను ప్రలోభాలకు గురి చేశారు. హయత్‌నగర్‌లోని ల్యాండ్ ఇష్యూకు సంబంధించి సదరు మహిళ రూ. 50 లక్షలను ఆ ముఠాకు అప్పగించింది. వివరాల్లోకి వెళితే.. హయత్‌నగర్‌లో ఉన్న ల్యాండ్ ఇష్యూపై హైడ్రాకు ఫిర్యాదు చేసింది ఓ మహిళ. ఇదే విషయాన్ని స్నేహితుల వద్ద కూడా చెప్పింది. అయితే తమకు హైడ్రా అధికారులు తెలుసని, ఈ విషయాన్ని తాము చూసుకుంటామని పలువురు వ్యక్తులు నమ్మబలికారు. దాంతో రూ. 50 లక్షలను ఆ మహిళను నుంచి తీసుకుంది ముఠా. ఇది హైడ్రా కమిషనర్ వరకూ వెళ్లడంతో అసలు విషయం బయటపడింది. దీంతో విచారణ చేయగా వారిపై పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు వరకు ఉన్న ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా, ఫిర్యాదు చేయాలన్నా నేరుగా తమనే సంప్రదించాలని కమిషనర్ ఏవీ రంగనాథ్ కోరారు. ప్రతి సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో నిర్వ హించే ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేయవచ్చని సూచిం చారు. హైడ్రా అధికారులు తమ బంధువులని, మిత్రులని, తమకు బాగా తెలుసంటూ ఎవరైనా చెబితే నమ్మి మోస పోవద్దని హెచ్చరించారు. హైడ్రాకు సంబంధించి ఫిర్యాదులు ఉన్నా తనను సంప్రదించవచ్చని స్పష్టం చేశారు.

**'వెలుగు'లోకి మోసం**

తుక్కుగూడ మునిసిపాలిటీ మంఖాల్ గ్రామం పరిధిలో వర్టెక్స్ నిర్మాణ సంస్థ లే అవుట్ అభివృద్ధి చేసింది. సూరం చెరువును ఆక్రమించడంతో పాటు కొత్తకుంటలో మట్టిపోసి బాక్స్ డ్రైన్ నిర్మించిందనే ఫిర్యాదు హైడ్రాకు అందింది. విచారణ చేపట్టిన హైడ్రా నిర్మాణ సంస్థపై రెండు కేసులు నమోదు చేసింది. తమ భూమిని ఆక్రమించి వర్టెక్స్ సంస్థ రోడ్డు నిర్మించిందని చైతన్యరెడ్డి హైడ్రాకు ఫిర్యాదు చేశాడు. ఇరు పక్షాలతో అధికారులు మాట్లాడారు. ఈ క్రమంలో ఫిర్యాదుకు సంబంధించి ఓ వ్యక్తికి రూ.50 లక్షలు ఇచ్చానని చెప్పాడు. దీనిపై సమగ్ర విచారణ జరిపిన హైడ్రా.. హైకోర్టు బార్ కౌన్సిల్ నుంచి తొలగించిన ఓ వ్యక్తి, అందరి జీవితాల్లో 'వెలుగు'లు నింపుతామనే ఓ డిజిటల్ మీడియా రిపోర్టర్, మరో డిజిటల్ మీడియా ప్రతినిధి కలిసి డబ్బులు తీసుకున్నట్టు నిర్ధారణకు వచ్చారు. రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు ఆ ముగ్గురిపై పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# శభాష్.. అమిత్

- డెయిరీ కార్పోరేషన్ పనితీరు భేష్
- విజయ డెయిరీని లాభాల్లోకి తీసుకొచ్చిన గుత్తా అమిత్ రెడ్డి
- అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** ప్రతినెల రూ.10కోట్ల మేరకు నష్టాలలో సాగుతున్న విజయ డెయిరీని ఏడాదిలోనే లాభాల్లోకి తీసుకొచ్చిన తెలంగాణ డెయిరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. తెలంగాణ డెయిరీ డెవలప్మెంట్ కార్పొరేషన్(విజయ డెయిరీ) చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా అమిత్ రెడ్డి శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ లోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంను శాలువతో సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. విజయ డెయిరీని లాభాల బాట పట్టించిన స్ఫూర్తితో మరింత పట్టుదలతో పని చేసి..వచ్చిన లాభాలను సంస్థ ద్వారా పాడి రైతుల సంక్షేమానికి ఖర్చు చేయాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి చైర్మన్ అమిత్ రెడ్డికి సూచించారు. మరో సంవత్సరం కాలంలో విజయ తెలంగాణ డైరీ అమ్మకాలను పెంచి, సమాఖ్యను పూర్తి లాభల్లోకి తీసుకుని వస్తానని, అందుకు పక్క ప్రణాళికతో పని చేస్తున్నామని గుత్తా అమిత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, అరికెల నర్సిరెడ్డి, రోహిణ్ రెడ్డి పాల్గొన్నారు.









నమోదు చేశారు. పరిధి విస్తరించి ఉన్న ఓఆర్ఆర్

రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp:
74369 39999

# జన్ నాయక్... ఏడాది ప్రస్థానం



రాజకీయాల్లో నాయకుడి పాత్ర కేవలం పార్టీ పరిమితుల్లోనే ఉండకూడదు. ప్రజల సమస్యలకు వాకిలిగా, ప్రభుత్వానికి అద్దంలా, పార్టీకి దిక్సూచీలా నిలిచే వ్యక్తినే ప్రజలు తమ సొంత నాయకుడిగా భావిస్తారు. అలాంటి ప్రత్యేకలతో ప్రజల మనిషిగా ఉంటున్న పీసీసీ అధ్యక్షుడిగా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తొలి ఏడాది ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. 2024 సెప్టెంబర్ 6న టీపీసీసీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన సామాజిక న్యాయం పట్ల నిబద్ధతతో పార్టీ బలోపేతానికి వ్యూహాత్మకమైన ప్రణాళికలతో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పార్టీ కీలక పాత్ర పోషించేందుకు ఆయన కృషి చేశారు. రాజుల కాలంలో రాజులు ప్రజల మధ్య తిరుగుతూ వారి యోగక్షేమాలు తెలుసుకునేవారు. ఇప్పుడు మహేశ్ గౌడ్ కూడా ప్రజల మధ్యనే ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా గామాల్లో, పట్టణాల్లో, బస్తీల్లో, కాలనీల్లోనే పర్యటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే కాకుండా పొలం బాట కూడా పట్టి రైతుల్లో భరోసా కల్పిస్తున్నారు. ఆయన నడకలో ఆర్భాటం ఉండదు. నిరాడంబరంగా చిన్న బృందంతో ప్రజలతో మమేకం అవుతున్నారు. ప్రజా సమస్యలు విన్నవెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి పరిష్కారం తీసుకురావడం ఆయన శైలిగా మారింది. ఇదే ఆయనకు ''ప్రజల మనిషి'' అనే గుర్తింపుని తెచ్చిపెట్టింది.

దశాబ్ద కాలం పాటు బిఆర్ఎస్(గడీల)పాలనలో ప్రజలు అనేక సమస్యలతో సతమతమయ్యారు. ప్రగతి భవన్ గేటు దాటి ప్రజా ప్రతినిధులు బయటకు రావడమే గగనమైంది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి మారింది. ప్రజల సమస్యల పరిష్కారానికి మహేష్‌గౌడ్ గాంధీ భవన్ కేంద్రంగా వినూత్న కార్యక్రమాలు ప్రారంభించారు. ''మంత్రులతో ముఖాముఖి'', ''అందుబాటులో ప్రజా ప్రతినిధులు'' వంటి కార్యక్రమాల ద్వారా రైతులు, విద్యార్థులు, మహిళలు, కార్మికులు... ఎవరికైనా నేరుగా మంత్రుల ఎదుటే తమ సమస్య చెప్పుకునే అవకాశం కలిగింది. ఈ కార్యక్రమాలు ప్రజాస్వామ్య పాలనలో పారదర్శకతకు ప్రతీకగా నిలిచాయి. మంత్రుల నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్ల వరకు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ఆయన తీసుకున్న చొరవతో ప్రజల సమస్యల పరిష్కారంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది.

సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి దిశగా గత 22 నెలల్లో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది. కానీ ఆ పథకాలు ప్రతి అర్హుడి వద్దకు చేరుతాయా అన్నదే చాలా కీలక అంశం. ఈ పర్యవేక్షణ బాధ్యతను పీసీసీ అధ్యక్షులు మహేశన్న తన భుజాన వేసుకున్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, ఆరోగ్యశ్రీ పెంపు, ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరా శక్తి పథకం ఇలా ప్రతి పథకం క్షేత్రస్థాయిలో అమలు వెనుక ఆయన ప్రత్యేక దృష్టి పెట్టారు. మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్‌లను చురుకుగా భాగస్వాములుగా చేసి, పథకాల పట్ల విస్తృత స్థాయిలో ప్రచారం కల్పిస్తూ వారిలో చైతన్యం కల్పించారు. తెలంగాణ భవిష్యత్తు యువత పైనే ఉందని గుర్తించి ఉద్యోగ నియామకాలు, ఉపాధికి రుణ సదుపాయాలు, రాజీవ్ యువ వికాసం వంటి కార్యక్రమాలపై పార్టీ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోంది. హాస్టళ్లు, గురుకులాల్లో సదుపాయాలు పరిశీలించడం, నాణ్యమైన ఆహారం అమలు అంశాలపై పీసీసీ స్వయంగా పర్యవేక్షిస్తోంది. జిల్లా నేతలను ప్రాక్టికల్ ఇన్స్పెక్షన్లకు దింపి, సమస్యలను కాగితాలకే పరిమితం చేయకుండా పరిష్కారానికి మహేశ్ చర్యలు తీసుకున్నారు.

బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన, బీసీలకు 42% రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ వంటి చరిత్రాత్మక నిర్ణయాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు మహేష్‌గౌడ్ ప్రధాన పాత్ర పోషించారు. అణగారిన వర్గాలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్, బీజేపీ పార్టీల డబుల్ గేమ్‌ను ఎండగడుతూ చేపట్టిన ఉద్యమాలు, కాంగ్రెస్ ప్రతిష్టను కేవలం ఓ పార్టీగా కాకుండా సామాజిక న్యాయ వేదికగా ఎదిగేలా చేశాయి. దేశవ్యాప్తంగా కులగణనపై కాంగ్రెస్ నినాదం బలంగా వినిపించడంలో తెలంగాణ పీసీసీ పాత్ర స్పష్టంగా ఉంది. కేంద్రం చివరికి జాతీయ స్థాయిలో ఈ అంశాన్ని అజెండాలోకి తెచ్చుకోవాల్సి వచ్చింది. మహేశన్న నేతృత్వంలో పీసీసీ కేంద్ర బీజేపీపై నిరంతర పోరాటం సాగిస్తోంది. తెలంగాణకు నిధుల కేటాయింపులో అన్యాయం, ప్రాజెక్టులకు సరైన బడ్జెట్ ఇవ్వకపోవడం, పెట్టుబడిదారులకు ప్రాధాన్యం ఇస్తూ పేదలను విస్మరించడం వంటి అంశాలపై ఢిల్లీ వీధుల్లోనూ నిరసనలు నిర్వహించారు. రాష్ట్రంలో బీజేపీ చేసే తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టడంలోనూ పీసీసీ ముందంజలో ఉంది. బీజేపీ కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసం మాత్రమే పనిచేస్తుందనే వాస్తవాన్ని ప్రజల్లో బలంగా నిలబెట్టడంలో మహేశన్న పోరాటం నిరంతరం కొనసాగుతోంది.

మహేష్ గౌడ్ బీసీ వర్గానికి చెందిన నాయకుడు కావడంతో, ఆయనపై అన్ని వెనుకబడిన వర్గాలకూ ఆత్మీయత ఉంది. పీసీసీ కమిటీ నిర్మాణం, వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల నియామకాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఆయన సముచిత ప్రాధాన్యత ఇచ్చారు. ఈ విధానం కాంగ్రెస్‌ను సమాన హక్కుల వేదికగా, అన్ని వర్గాలకు స్వరంగా నిలబెట్టింది. భవిష్యత్తు వృద్ధికి పునాది వేసింది. ఇప్పటికే మహేశ్ కుమార్ గౌడ్ చేపట్టిన జనహిత పాదయాత్ర రెండు విడతల్లో విజయవంతమై మూడవ విడతకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇది కేవలం రాజకీయ యాత్ర కాదు. ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో అందుతున్నాయా లేదా తెలుసుకోవడానికి , ఏమైనా స్థానిక సమస్యలు ఉంటే గుర్తించడం ఈ యాత్ర ప్రధాన ఉద్దేశం. 2047 నాటికి తెలంగాణను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దే ''తెలంగాణ రైజింగ్'' లక్ష్యంతో పీసీసీ ఈ యాత్రను చేపడుతోంది. ఒక పార్టీ అధ్యక్షుడు కేవలం సమావేశాలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రజల్లోకి వెళ్లడం, ప్రభుత్వ పని తీరుని పర్యవేక్షించడం, బహుజన వర్గాలకు న్యాయం చేయడం, ప్రజా సమస్యలకు వారధిగా నిలవడం ఇవన్నీ కలిపి మహేష్ గౌడ్ నాయకత్వాన్ని ప్రత్యేకంగా నిలిపాయి. ఆయన రాజకీయ చతురత, సామాజిక నిబద్ధత, ప్రజా పోరాటాల సమన్వయం రాబోయే దశాబ్దంలో తెలంగాణ కాంగ్రెస్ మరింత బలోపేతం చేస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.



- అమరవాజి నాగరాజు,
పి.ఆర్.ఓ, టీపీసీసీ ప్రెసిడెంట్

# బీహార్‌లో మహిళా ఓటర్లే కీలకం



భారతదేశ రాజకీయాలన్నీ ఇపుడు బీహార్ చుట్టూ తిరుగుతున్నాయి. బీహార్ రాజకీయాలు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కొత్త మలుపులు తీసుకుంటున్నాయి. మొన్నటి వరకు ఓట్ చోరీపై విపక్షాలు చేసిన ఆరోపణల గురించి వాడివేడి చర్చ జరగగా, ఇప్పుడు మహిళా లోకం ఆత్మగౌరవ అంశం తెరపైకి వచ్చింది. తన మాతృమూర్తిపై బీహార్‌లోని దర్భంగలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన అసభ్య వ్యాఖ్యలపై ఇటీవలే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్వేగంతో స్పందించారు. మహిళల ఉనికికి సంబంధించిన ఈ అంశంపై కాంగ్రెస్, ఆర్‌జేడీ పార్టీలను నిలదీయాలని మహిళా ఓటర్లకు పిలుపునిచ్చారు. సెంటిమెంట్ అస్త్రాన్ని బయటకు తీశారు. సర్ తో ఓట్లు కొల్లగొడుతున్నారని కాంగ్రెస్ ఆరోపిస్తుంటే, బీజేపీ కూటమి కొత్త అస్త్రం బయటకు తీసింది.

## మలుపులు.. మెరుపులు

బీహార్ రాజకీయాల్లో మహిళా ఓటర్లే రాజకీయ పార్టీల జాతకాలు తారుమారుచేస్తారు. మహిళలు ఎటు మొగ్గితే అటే సర్కార్. బీహార్ లో మొత్తం 2 కోట్ల 96 లక్షల మందికిపైగా మహిళా ఓటర్లు ఉన్నారు. ప్రధాని మోదీ బీసీ వర్గానికి చెందిన వారు. బీసీ వర్గానికి చెందిన నాయకుడి తల్లిని విపక్షాలు అవమానించాయనే అంశాన్ని ఈ ఎన్నికల్లో బీజేపీ వాడుకునే అవకాశం ఉంది. మోదీ తల్లిపై రాహుల్ వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ ఇప్పటికే దుమారం రేపుతోంది. ఎందుకంటే బీహార్‌లోని ఓటర్లలో 36 శాతం కంటే ఎక్కువ మంది బీసీలే. లోక్‌సభ ఎన్నికలైనా, అసెంబ్లీ ఎన్నికలైనా బీహార్‌లో మహిళల ఓటింగ్ శాతం పురుషుల కంటే ఎక్కువగా ఉంది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో బీహార్‌లోని 243 అసెంబ్లీ స్థానాలకుగానూ 167 స్థానాల్లో పురుషుల కంటే మహిళల ఓటింగే ఎక్కువగా నమోదైంది. ఆ పోల్స్‌లో పురుషుల ఓటింగ్ 54 శాతమే ఉండగా, మహిళల ఓటింగ్ ఏకంగా 60 శాతంగా నమోదైంది. ఉత్తర బిహార్‌లోనైతే మహిళల ఓటింగ్ ఏకంగా 65 శాతానికి చేరింది. ఆ ఎన్నికల్లో 41 శాతం మంది మహిళలు ఎన్‌డీఏ కూటమికి, 31 శాతం మంది మహిళలు మహా (ఇండియా) కూటమికి ఓటు వేశారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అత్యధికంగా 125 సీట్లను గెల్చుకొని స్పష్టమైన మెజారిటీని సాధించింది. మహా (ఇండియా) కూటమి 110 సీట్లకు పరిమితమైంది. త్వరలో జరగనున్న 2025 అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహిళా ఓటర్ల సాయాన్ని పొందాలనే పట్టుదలతో ఎన్‌డీఏ కూటమి ఉంది.



ఇందుకోసం దర్భంగ ఘటనను పూర్తిస్థాయిలో వినియోగించుకునే దిశగా పావులు కదుపుతోంది.

## ఎపుడైనా వారే...

2010 నుంచి 2024 వరకు బీహార్‌లో జరిగిన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలిస్తే మహిళా ఓటర్ల జోరు స్పష్టంగా కనిపిస్తుంది. వారు ఎక్కువగా ఎన్‌డీఏ కూటమి వైపే మొగ్గు చూపిన విషయం తేటతెల్లం అవుతుంది. 2010లో బీహార్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 54 శాతం మంది మహిళలు ఓట్లు వేశారు. 51 శాతం మంది పురుషులు ఓట్లు వేశారు. ఆ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమికి ఏకంగా 206 సీట్లు వచ్చాయి. 2015లో జరిగిన బీహార్ అసెంబ్లీ పోల్స్‌లో మహిళలు 60 శాతం మంది, పురుషులు 50 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ టైంలో జేడీయూ, ఆర్‌జేడీ కూటమిగా ఏర్పడ్డాయి. నీతీశ్ కుమార్ వల్ల మహిళా ఓటర్ల మద్దతు మహా కూటమికి లభించింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీహార్‌లోని 40 స్థానాలకుగానూ 26 చోట్ల పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఓటు వేశారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీహార్‌లోని 32 స్థానాల్లో మహిళలే ఎక్కువగా ఓటు వేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిహార్‌లో మహిళల ఓటింగ్ 61 శాతంగా నమోదైంది. పురుషుల ఓటింగ్ 52 శాతానికి పరిమితమైంది. 2007లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల టైంలో గుజరాత్ అల్లర్ల అంశాన్ని ప్రస్తావిస్తూ నాటి కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. "నరేంద్ర మోదీ మౌత్ కా సౌదాగర్ (మరణాల వ్యాపారి)" అని కామెంట్ చేశారు. ఈ అంశాన్ని బీజేపీ జనంలోకి బలంగా తీసుకెళ్లి లబ్ధి పొందింది. గుజరాతీ సెంటిమెంట్‌ను బీజేపీ వర్కౌట్ చేసుకుంది. ఆ ఎన్నికల్లో గుజరాత్‌లోని మొత్తం 182 అసెంబ్లీ సీట్లలో 117 బీజేపీయే గెల్చుకుంది. "మోదీ టీ అమ్మేవాడు" అంటూ 2014 లోక్‌సభ ఎన్నికల టైంలో మాజీ కేంద్ర మంత్రి మణి శంకర్ అయ్యర్ విమర్శించారు. ఈ వ్యాఖ్యలతో దేశంలోని పేదలను కాంగ్రెస్ పార్టీ అవమానించిందని బీజేపీ మండి పడింది. ఇదే అంశాన్ని దేశవ్యాప్తంగా ప్రచారం చేసింది. ఫలితంగా నరేంద్ర మోదీ దేశానికి ప్రధానమంత్రి అయ్యారు. "చౌకీదార్ చోర్" అంటూ 2019 లోక్‌సభ ఎన్నికల టైంలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు చేశారు. అదే ఏడాది హర్యానాలోని అంబాలాలో జరిగిన ర్యాలీలో ప్రియాంకా గాంధీ కూడా మోదీపై విమర్శలు గుప్పించారు. మోదీని దుర్యోధనుడితో పోల్చారు. ఈ అంశాలతో ఎన్నికల్లో బీజేపీ లబ్ధి పొందింది. 2014 కంటే ఎక్కువ సీట్లతో ఎన్‌డీఏ కూటమి వరుసగా రెండోసారి గెలిచింది. 2022లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధాని మోదీని రావణుడితో పోలుస్తూ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు చేశారు. మోదీకి రావణుడిలా 100 తలలు ఉన్నాయన్నారు. ఆ ఎన్నికల్లో బీజేపీ 156 సీట్లు గెల్చుకుంది. కాంగ్రెస్ 17 సీట్లకు పరిమితమైంది. 2023లోనూ కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే విమర్శలు చేశారు. ఆయన ప్రధాని మోదీని విషపూరిత పాముతో పోల్చారు. కాంగ్రెస్ విమర్శలపై సెంటిమెంట్ పూసి లబ్ధిపొందడం మోదీకి అలవాటుగా మారిందన్నవ విశ్లేషణలున్నాయి.

- మహా డెస్క్




# ఇస్లాం వనంలో వికసించిన అత్యున్నత మహనీయుడు మహ్మద్ ప్రవక్త

**అమనగల్లు, మహా :** ఇస్లాం వనంలో వికసించిన అత్యున్నత మహనీయుడు మహ్మద్ ప్రవక్తఅని, మత గురువు మహ్మద్ అబ్దుల్ వాహేద్, లతీఫ్ కోరారు. గురువారం రాత్రి మహ్మద్ ప్రవక్త జన్మ దినం సందర్భంగా అమనగల్లు పట్టణంలోని మిలాద్ ఉన్ నబి పండుగను ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జామా మసీద్, మహ్మదీయ మసీద్లను విద్యుత్ దీపాలతో అలకరించి ప్రత్యేక ప్రార్ధనలు, దువ్వాలు లు నిర్వహించి జాగరణ చేశారు. నూరే ముస్తఫా నవ్ జవాన్ కమిటీ ఆమనగల్లు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మక్కా మదీనా,ఖాబా షరీఫ్ యొక్క ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది.ఈ సందర్భంగా మత గురువులు ప్రసంగిస్తు మానవులంతా ఒక్కటేనని తారతమ్య బేదం లేకుండా శాంతి, సహజీవనం దానం, దైవనితితో మెలగాలని మహ్మద్ ప్రవక్త భోదించారని ప్రతి ఒక్కరు ఆదిశలో పయనించాలని, సమాజంలో శాంతి నెలకొల్పేందుకు, సర్వమానవాళి శ్రేయస్సు కోసం అల్లా ఆఖరి ప్రవక్తగా జన్మించారని అందుకు అంతిమ దైవ గ్రంథమైన ఖురాన్ తెలిపారని వారు చెప్పారు. మహ్మద్ ప్రవక్త యొక్క సూక్తులను బయాన్ ద్వారా ముస్లీం సోదరులకు వివరించారు. మహమ్మద్ ప్రవక్త ప్రపంచానికి శాంతి, సౌభ్రాతృత్వాలను సోదరభావాన్ని బోధించారని గుర్తు చేశారు. వారి మార్గంలో పయనిస్తూ ప్రపంచ మానవాళి శ్రేయస్సు కోసం ప్రార్థించాలని సూచించారు.మహ్మద్ ప్రవక్త చూపిన బాటలో ప్రతి ఒక్క ముస్లీం నడిచినపుడే జీవితం సార్థకం అవుతుందన్నారు. పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ మహ్మద్ ప్రవక్తను స్మరించుకున్నారు. శాంతికి చిహ్నమైన మహ్మద్ ప్రవక్త జన్మదినం రోజున ప్రతి ఏటా మిలాద్ ఉన్ నది పండుగను జరుపుకుంటారని వారు పేర్కొన్నారు..పండుగను పురస్కరించుకొని సిఐ జానకిరాం రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటేష్ పర్యవేక్షణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మత పెద్దలు నవ్ జవాన్ కమిటీ సభ్యులు హైమద్,అసద్, షోయేబ్, సోహెల్, గౌస్, పాషా,సోను, అబేద్, సల్మాన్, రెహన్, సజ్జద్, అంజద్, పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు




**రంగారెడ్డి జిల్లా మహా:** వాహనదారులు నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని సిఐ నరసింహారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ ట్రాఫిక్ నిబంధనపై సిఐ నరసింహారెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రమైన, ఇబ్రహీంపట్నంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వాహనదారులు సాగర్ రహదారికి ఇరువైపులా ఇష్టానుసారంగా నిలపడంతో, అటుగా వెళ్లే వాహనాలకు అంతరాయం కలగడం కారణంగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని అన్నారు. హైదరాబాద్, టూ, నాగార్జునసాగర్ హైవే కావడంతో భారీ వాహనాలు పెద్ద సంఖ్యలో రావడంతో, చిన్న వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ, వాహనాలను రోడ్డుపై నిలవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన అన్నారు.

**దుకాణ యజమానుల కారణంగా....**

దుకాణ యజమానులు తమ యొక్క షట్టర్ పరిధి దాటి వస్తువులను, ఫుట్ పాత్ పై పెట్టడంతో పాదచారులు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దుకాణానికి వచ్చిన కస్టమర్ తన వాహనాన్ని రోడ్డుపై నిలిపి దుకాణంలోకి రావడం ద్వారా ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ముఖ్యంగా అంబేద్కర్ చౌరస్తా నుంచి పోలీస్ స్టేషన్ వరకు, మంచాల్ రోడ్డులో దుకాణ సముదాయ యజమానులు, తమకు సంబంధించిన వస్తువులను రోడ్డుపై పెట్టకుండా, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ మున్సిపాలిటీ సిబ్బందికి, ట్రాఫిక్ పోలీసులకు, ప్రజలకు సహకరించే విధంగా ఉండాలని ట్రాఫిక్ సిఐ నరసింహారెడ్డి తెలిపారు. త్వరలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం... ఇబ్రహీంపట్నంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు, మున్సిపాలిటీ అధికారులతో చర్చించి సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారి పట్ల కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎవరైనా దుకాణ యజమానులు ఫుట్ బాతును, రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడం జరుగుతుందని హెచ్చరించారు.

**వాహనదారులు సురక్షితంగా గమ్యం చేరాలి...**

వాహనదారులు తమ వాహనాలను సూచించిన పార్కింగ్ స్థలంలో వాహనాలు నిలపాలని, నో పార్కింగ్ స్థలంలో వాహనాలు నిలపరాదని, ఇతరులకు ఇబ్బంది కలిగిస్తూ, నిబంధనలను ఉల్లంఘిస్తూ నిలిపినచో వారి వాహనాలపై చలానాలు విధిస్తూ, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. వాహనదారులు వాహనాన్ని నడిపే క్రమంలో తలకు హెల్మెంట్ తప్పనిసరిగా ధరించాలని, నిబంధనలు పాటిస్తూ, మీకోసం ఇంటిదగ్గర ఎదురుచూసే మీ కుటుంబం కోసం, సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని సిఐ నరసింహారెడ్డి అన్నారు.



# వెటర్నరీ అసిస్టెంట్‌గా పదోన్నతి

**ఆమనగల్లు,మహా:** ఆమనగల్లు పట్టణ కేంద్రానికి చెందిన ఎండి అఫ్సర్ గత కొన్నేళ్లుగా తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామంలో పశు వైద్యశాలలో ఆఫీస్ సబర్డినేట్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ గా కందుకూర్ పశువైద్యశాల పదోన్నతి పొందారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా పశు సంపర్ధక శాఖ కార్యాలయంలో జిల్లా జాయింట్ డైరెక్టర్ మధుసూదన్ చేతుల మీదుగా పద్ధోన్నతి పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు, గట్టు ఇప్పలపల్లి పశు వైద్యశాల సిబ్బంది, గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు.

# సింగిల్ హ్యాండ్ గణేష్

- 43 సంవత్సరాలుగా ఒకే ఒక్కడు..
- ఇది లింగారెడ్డిగూడెం గ్రామస్తుల ప్రత్యేకత
- గ్రామస్తుల ఐక్యతకు, ప్రత్యేకతకు నిదర్శనం
- డీజే లేదు.. మైకు లేదు.. అంతా భజనే



**షాద్ నగర్, మహా:** గల్లి గల్లిలో గణపయ్య.. వార్తలు మనం తరచూ చూస్తుంటాం.. పట్టణాన్ని వదిలి పల్లెకు పాకిన ఈ సంస్కృతి విస్తరించి గ్రామాలకు కూడా వ్యాపించింది. ప్రస్తుతం ప్రతి గ్రామంలోని వీధివీధిలో వినాయకుడు దర్శనమిస్తున్నాడు. కానీ లింగారెడ్డిగూడెం రూటే వేరు.. 43 ఏళ్లుగా ఈ గ్రామంలో గణపయ్య ఒకే ఒక్కడుగా ఏకచిత్రాధిపత్యాన్ని కొనసాగిస్తున్నాడు. పార్టీలు వేరైనా, విధానాలు వేరైనా గణపతి విషయంలో మాత్రం గ్రామస్తులంతా ఓకే తాటిపై నిలబడి తమ ప్రత్యేకతను చాటుతున్నారు. సరిగ్గా 43 సంవత్సరాల క్రితం రెడ్డి సంఘం భవనంలో వినాయకుడి ప్రతిమను ప్రతిష్టించడం జరిగింది. గ్రామ పెద్దలు చల్లా సుదర్శన్ రెడ్డి, చల్లా పెద్ద వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిరాటంకముగా కొనసాగుతూ వచ్చింది. ప్రస్తుతం అమరలింగేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో ఇక్కడి గణపయ్య పూజలు అందుకుంటున్నాడు. మాజీ ఎమ్మెల్యేలు భీష్వ కిష్టయ్య, బక్కని నర్సింలు, మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి తదితర నాయకులు ఉన్న ఈ గ్రామం ఇద్దరు ఎమ్మెల్యేలను నియోజకవర్గానికి ఇచ్చింది. కానీ ఎన్ని రాజకీయ పార్టీలు ఉన్నా కలిసికట్టుగా భక్తిశ్రద్ధలతో ఊరంతా ఒక్కటై ఒకే ఒక్క వినాయకుని ప్రతిష్టించి కలిసి మెలసి కార్యక్రమాన్ని జరుపుకుంటుండడం విశేషం. ఈ సంప్రదాయాన్ని ఇలాగే కొనసాగించాలని, ఇతర గ్రామాలలో ఇది ఆదర్శంగా మారాలని కాంగ్రెస్ సీనియర్ నేత లింగారెడ్డిగూడెం అశోక్ ఆకాంక్షించారు.లింగారెడ్డిగూడెం అశోక్తన స్వగ్రామ్ అయినందుకు తను గర్వపడుతున్నట్లు తెలిపారు. తమ గ్రామంలో వినాయక వారోత్సవాల సందర్భంగా డీజేలు, మైకులు ఎలాంటి శబ్ద కాలుష్యం ఉండదని కేవలం భజనలు పూజలు మాత్రమే చేస్తామని పేర్కొన్నారు..



## మన జీవితంలో తల్లిదండ్రుల తర్వాత ముఖ్యమైన స్థానం ఉపాధ్యాయులదే..

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**


**షాద్ నగర్, మహా:** మన జీవితంలో తల్లిదండ్రుల తర్వాత ముఖ్యమైన స్థానం ఉపాధ్యాయులదే అని వారు మనకు చదువుతో పాటు మంచి విలువలు కూడా నేర్పిస్తారని ఉపాధ్యాయులు లేకపోతే జ్ఞానం అనే వెలుగు మన జీవితాల్లో చేరేది కాదని వారు చూపే మార్గమే మన విజయానికి పునాది అవుతుందని నిజమైన చరిత్ర సృష్టికర్త ఉపాధ్యాయుడే అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవాని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తనకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతో పాటు నియోజకవర్గంలోని గురువులను సన్మానించి పాదాభివందనం చేసి ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవాని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత మాజీ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త, పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన ఆదర్శప్రాయుడైన విద్యావేత్త అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జ్ఞాపకార్థం ఆయన పుట్టిన రోజు సెప్టెంబర్ 5 న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటామని అన్నారు.

# సకల మనవాళిని ప్రేమించాలి

- మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి
- జెపి దర్గాలో ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు
- ప్రార్థనలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే వై అంజయ్యా యాదవ్, మాజీ ఎంపీపీ మధుసూదన్ రెడ్డి
- దర్గాలో మైనార్టీ సోదరుల అన్నదాన కార్యక్రమం



**షాద్ నగర్, మహా:** ప్రవక్త బోధనలు కరుణ, సహనం, సామరస్యం, సార్వత్రిక సోదర భావంతో మానవాళిని శాంతి, సమష్టి శ్రేయస్సు వైపు నడిపిస్తాయని మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. అదేవిధంగా తోటి వారి పట్ల విశ్వాసం, దయ, నమ్మకంతో సేవ చేసినప్పుడు ప్రవక్త మహ్మద్ సందేశాన్ని పాటించిన వారమవుతామనీ షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై అంజయ్య యాదవ్ అన్నారు. వీరు శుక్రవారం హజరత్ జహంగీర్ పీర్ దర్గా లో మిలాద్ ఉన్ నబీ వేడుకల సందర్భంగా స్థానిక మైనార్టీ నాయకులు ఘనంగా నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. దర్గా ఆవరణలో బాబాకు ప్రత్యేక దట్టిలను సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. నిజమైన స్ఫూర్తితో మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు. సకల మానవాళికి ఆయన బోధనలు సదా ఆచరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ మధుసూదన్ రెడ్డి, రషీద్ భాయ్, మాజీ సర్పంచులు మిట్టు నాయక్ అజయ్ నాయక్ మాజీ మండల అధ్యక్షుడు పెంటనోళ్ల యాదగిరి కౌన్సిలర్స్ కోస్గి శ్రీనివాస్ సోమ్లా నాయక్ మాధవి గోపాల్ గౌడ్ మాదారం నరసింహ గౌడ్ అనిత శ్రీనివాస్ గౌడ్ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు పెంటన్నోళ్ల రవికుమార్ యువ నాయకుడు శివాచారి ఇంద్రసేనా రెడ్డి దినేష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు..



## ఆరాంఘర్ చౌరస్తా వద్ద పప్పు లారీ బోల్తా

**డ్రైవర్ కి స్వల్ప గాయాలు**

**రాజేంద్రనగర్ మహా ;** మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ సిద్ధం అంబర్ బజార్ మార్కెట్ కి శనగపప్పు లోడుతో వస్తున్న భారీ లారీ శుక్రవారం 6 గంటల ప్రాంతంలో అరాంఘర్ చౌరస్తా వద్ద డివైడర్ ని ఢీకొని బోల్తా పడింది. లారీ డ్రైవర్ కి స్వల్ప గాయాలయ్యాయి. లారీ బోల్తా పడడంతోఅరంఘర్ చౌరస్తా నలుగు దిక్కుల నుంచి వస్తున్న వాహనాలతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. స్థానికులు పోలీసులకు సమాచారం చేరవేయడంతో. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్ ని క్లియర్ చేసి డ్రైవర్ని ఆసుపత్రికి తరలించారు.

# హార్ట్ కేకులా గణనాథుని లడ్డూలు



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిన్న గొల్లపల్లిలో చత్రపతి శివాజీ యూత్, నేతాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు లడ్డు ప్రసాదాన్ని మాజీ కౌన్సిలర్ చెన్నం అశోక్ రెండు లక్షల రూపాయలకు సొంతం చేసుకున్నారు. శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలోని ముదిరాజ్ సంఘం లో ఏర్పాటు చేసిన గణనాథుని లడ్డు వేలంపాటలో అదే గ్రామానికి చెందిన కనకమామిడి బిక్షపతి నాలుగు లక్షల 67 వేల రూపాయలకు లడ్డు ప్రసాదాన్ని సొంతం చేసుకున్నారు. సుల్తాన్ పల్లి గ్రామంలోని ప్రగతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని లడ్డు ప్రసాదాన్ని 1,60,000 వేల రూపాయలకు యాటకారి హరిచంద్ర ముదిరాజ్ లడ్డు ప్రసాదాన్ని సొంతం చేసుకున్నారు. మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ బంగారు మైసమ్మ దేవాలయంలో ప్రతిష్టించిన గణనాథుని లడ్డు ప్రసాదాన్ని వేలంపాటలో సంకూరి జయప్రకాష్ 2,25,000 రూపాయలకు దకించుకున్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ వినాయకుని లడ్డు వేలంపాటలో 3 లక్షల రెండు వేల రూపాయలకు గోకుల్ మహేష్ యాదవ్, కొండే బ్రదర్స్ కైవసం చేసుకున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ హనుమాన్ దేవాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుని లడ్డూ వేలంలో నాలుగు లక్షల 55 వేల రూపాయలకు బట్ట చిన్న నరసింహ దక్కించుకున్నారు. పుప్పాలగూడ శివనగర్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన గణనాథుని లడ్డు ప్రసాదాన్ని మూడు లక్షల 71000వేలకు లడ్డు ప్రసాదాన్ని కస్తూరి శ్రావణ్ సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో మండపం నిర్వాహకులు ఆలయ కమిటీ సభ్యులు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వెళ్ళిరా... వినాయక

- గంగమ్మ ఒడికి గణనాథులు
- చిందుల మధ్య శోభయాత్రలు
- పోటాపోటీగా లడ్డూల వేలం
- గణపతి బప్పా మోరియా.. ఆదా లడ్డూ కాలియా..
- 'జై బోలో గణేశ్ మహారాజ్ కీ జై' అనే నినాదాలతో పురవీధులు



**ఆమనగల్లు, మహా :** గణపతి బప్పా మోరియా.. ఆదా లడ్డూ కాలియా..' 'జై బోలో గణేశ్ మహారాజ్ కీ జై' అనే నినాదాలతో పలు మండల గ్రామాలలో పురవీధులు మారుమోగాయి. విశేష పూజలు అందుకున్న గణనాథులు శుక్రవారం నిమజ్జనానికి తరలాయి.ఈ సందర్భంగా శోభయాత్ర నిర్వహిస్తు డప్పు చప్పుళ్లు, కోలాటాలు, యువకుల కేరింతలు, చిన్నారుల చిందుల మధ్య శోభాయాత్ర కొనసాగింది. అధికసంఖ్యలో గణనాథులను శోభాయాత్రగా తరలించి భక్తులు నిమజ్జనం చేశారు. వివిధ గ్రామాలతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాలలో గ్రామస్తులు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో గణనాథులను ప్రతిష్ఠించి మండపాలలో నిత్యం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టి లడ్డూ వేలాలు నిర్వహించారు. సాయంత్రం మండపాల వద్ద నుంచి పిల్లలు, పెద్దలు భజనలు, నృత్యాల మధ్య పురవీదుల గుండా గణనాథులను వాహనాలలో ఊరేగించారు. అనంతరం చెరువులు, కుంటలకు తీసుకువచ్చారు.. గజ ఈతగాళ్ళు, వివిధ శాఖల అధికారుల సమక్షంలో క్రేన్ సహాయంతో గణనాథులను నిమజ్జనం చేశారు. ఈ నేపథ్యంలో పరిసర ప్రాంతాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ, మత్స్యశాఖ, విద్యుత్, వైద్యశాఖ అధికారులంతా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



## ప్రపంచంలో శాంతి వాతావరణం నెలకొనాలి

**కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్, మహా ;** బాలాపూర్ విఘ్నేశ్వరుడుని బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి కృప కటాక్షలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆనందంగాఉండాలని ఆకాంక్షించారు. యుద్ధాలను విరమించుకొని, శాంతి వాతావరణం నెలకొనాలన్నారు. బాలాపూర్ గణనాథుని చల్లని ఆశీస్సులతో దేశం శాంతి మరియు సుభిక్షంగా ఉండాలన్నారు. ప్రజలందరం పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. మండపం నిర్వాహకులు ప్రజలు అధికారులకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ మరియు డివిజన్ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జామియా మస్జీద్‌లో అసారే ముబారక్ కార్యక్రమం



**షాద్ నగర్, మహా:** షాద్ నగర్ లో మొహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని శుక్రవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపల్ ఫరూక్ నగర్ లోని జామే మస్జీదులు ఇమామ్ సయ్యద్ షాబుద్దీన్, సయ్యద్ అజరుద్దీన్ హాఫెజ్ ఆధ్వర్యంలో ఘనంగా ఆ సారే ముబారక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముస్లిం మత పెద్దలు సయ్యద్ రావుఫ్ అలీ హాఫెజ్, మునవర్ అలీ హాఫేస్,షఫీ హాఫెజ్ ,సయ్యద్ నదీమ్ హాఫెజ్ , షోయబ్ అత్తరి హాఫిజ్ , యాకూబ్, లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రావుఫ్ అలీ హాఫెజ్ మాట్లాడుతూ... మహమ్మద్ ప్రవక్త స్తుతించిన పవిత్ర జలం త్రాగితే అన్ని రోగాలు సయమవుతాయని అన్నారు. శాంతి సహనానికి సఖ్యతకు, మహమ్మద్ ప్రవక్త బోధనలు చిహ్నం అని అన్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ ప్రవక్త వెంట్రుకలను ప్రదర్శించారు. వీటిని తిలకించేందుకు ముస్లింలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మస్జిద్ కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

# గణపయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలి

**భక్తిశ్రద్ధలతో వినాయకుడిని పూజించాలి.. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు**

**రంగారెడ్డి జిల్లా మహా:** విఘ్నాలను తొలగించే ఆది దేవుడు గణపయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. శుక్రవారం యాచారం మండలం, మాల్ గ్రామ పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడికి నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులతో కలిసి ఆయన ప్రసాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ రాజు మాట్లాడుతూ... ఐక్యత, భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులను అందించాలని విఘ్నేశుడిని ఆకాంక్షించారు. ఈ యొక్క కార్యక్రమంలో ఎస్సై ఉయ్యాల మధు, ఇందిరమ్మ కాలనీ వాసులు, భగత్ సింగ్ యూత్ సభ్యులు, మాల్ గ్రామ ప్రజలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






## కానిస్టేబుల్‌తో దురుసు ప్రవర్తన

**ఇద్దరు రిమాండ్**

**ఆమనగల్లు, మహా :** మద్యం మత్తులో పోలీసుతో దురుసుగా ప్రవర్తించడమే కాకుండా విధులకు ఆటంకం కలిగించినందుకు ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆమనగల్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.ఎస్ ఐ తెలిపిన వివరాల ప్రకారం కోనాపూర్ గ్రామానికి చెందిన వినయ్, శివ గురువారం రాత్రి ఎస్ బి కానిస్టేబుల్ కోనాపూర్ వద్ద విధులు నిర్వహిస్తుండగా త్రాగిన మత్తులో దురుసుగా ప్రవర్తించడంతోపాటు విధులకు ఆటంకం కలిగించాడన్నారు. పిర్యాదు మేరకు దీనిపై కేసు నమోదు చేసి, శుక్రవారం రిమాండ్ కు తరలించారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయండి

**సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే రామస్వామి**



**రంగారెడ్డి జిల్లా మహా:** ఈనెల 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని, శుక్రవారం సిపిఐ మండల కార్యదర్శి ఎం సత్తిరెడ్డి అధ్యక్షతన సిపిఐ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే రామస్వామి హాజరై మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటం అనేది 1946 నుండి 1951వరకు, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఏడవ నిజాం మీరు ఉస్మాన్ ఆలీ కానుక వ్యతిరేకంగా జరిగిన సాయిధ తిరుగుబాటు అని, ఈ పోరాటంలో దాదాపు 4500 మంది తెలంగాణ రైతులు, ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ఈ పోరాటం ప్రధానంగా హైదరాబాద్ రాష్ట్రంలోని భూస్వామ్య వ్యవస్థకు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిందని తెలిపారు. నిజాం పాలనను అంతం చేసి హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనం కావడానికి, ఈ పోరాటం దారితీసిందని భూస్వాముల దోపిడీని నిలిపి రైతుల హక్కులను కొంతమేరకైనా పరిరక్షించారని, ఈ పోరాట స్ఫూర్తితోనే ఈనెల 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 17వ తేదీన హైదరాబాదులోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో ముగింపు సభ ఉంటుందని, ఈ సభకు పార్టీ శ్రేణులు గ్రామ కార్యదర్శులు ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని, ఈ వారోత్సవాలను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ప్రభులింగం, జిల్లా కార్యవర్గ సభ్యుడు వడ్ల సత్యనారాయణ, ఇన్సాబ్, జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బుల్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాన్ని నిర్వహించుకోవాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**




**మంచిర్యాల, మహా :** ప్రశాంత వాతావరణంలో గణపతి నిమర్జనాన్ని నిర్వహించుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గత తొమ్మిది రోజులుగా జిల్లాలోని వివిధ గ్రామాలు, పట్టణాలలో ప్రజలు గణపతి నవరాత్రులు పిల్లాపాపలతో రంగ రంగ వైభవంగా నిర్వహించుకున్నారని అన్నారు. అనంతరం నిర్వహించే శోభాయాత్రలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మండల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లాలోని జైపూర్ మండలం ఇందారం సమీపంలోని గోదావరి వంతెన వద్ద నిమజ్జన ఏర్పాట్లను ఇందారం పంచాయతీ సెక్రటరీ సుమన్ తో కలిసి పరిశీలించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన గణేష్ మండళ్ల వివరాలను నమోదు చేసి అందుకు అనుగుణంగా రూట్ మ్యాప్ ను ఆయా మండళ్ల నిర్వాహకులు అనుసరించాలని తెలిపారు. నిమజ్జన ప్రదేశాలలో విద్యుత్, మత్స్యశాఖ, పోలీస్, రెవెన్యూ సంబంధిత శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా జరిగే విధంగా మార్గదర్శకాలు జారీ చేయడం జరిగిందని, భద్రత దృష్ట్యా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. నిమజ్జన ప్రదేశాలలో క్రేన్, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన గ్రామాల్లో బీటీ రోడ్లకు 13 కోట్ల 12 లక్షల నిధులు

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం 13 కోట్ల 12 లక్షలు మంజూరైనట్టు నియోజక వర్గ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు. వీటి ద్వారా గిరిజన గ్రామాలలో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్టు ఆయన వివరించారు. 1.ఆదిలాబాద్ రూరల్ మండలం శివఘాట్ నుండి కుంభఝురీ మీదుగా టాక్లీ వరకు 2కోట్ల 38 లక్షలతో 3కిలో మీటర్ల బీటీ రోడ్డు పనులు చేపట్టనున్నారు. 2.అల్లికోరి ఎక్స్ రోడ్ నుండి అల్లికోరి గ్రామం మీదుగా పొట్టంలొద్ది వరకు 2కోట్ల 87 లక్షలతో 3 కిలో మీటర్ల బీటీ రోడ్, 3. బేల మండలం సాంగ్వి నుండి పాటగూడ వరకు కోటి రూపాయలతో 1కిలో మీటర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు , 4.ఆదిలాబాద్ రూరల్ మండలం ఖండాల ఎక్స్ రోడ్ చిచ్ ధరి ఖానాపూర్ వరకు 75 లక్షలతో 0.20కిలో మీటర్ల బీటీ రోడ్ మిగిలిన పనులు, 5. చించుఘాట్ నుండి చిన్న పెందూర్ లొద్ది మీదుగా తోషం వరకు 5కోట్ల 10 లక్షలతో 6.70 కిలోమీటర్ల మిగిలిన బీటీ రోడ్ పనులు, 6.లోహారా నుండి హరిజనగూడ, సలాయిగూడ, చిల్లత్గూడ శివగూడ మీదుగా తిప్ప ఎక్స్ రోడ్ వరకు 85 లక్షలతో 0.50 కిలోమీటర్ల బీటీ రోడ్డు మిగిలిన పనులను చేయనున్నారు. 7. అంకోలి ఎక్స్ రోడ్ నుండి దండారి గూడ స్పాన్ బ్రిడ్జి చెక్ డ్యాం మిగిలిన పనులను 17లక్షలతో ,చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ నిధులు మంజూరు చేసిన ప్రభుత్వానికి కృషి చేసిన కంది శ్రీనివాస రెడ్డి కి మండల ప్రజలు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

## కేంద్ర మంత్రిని కలిసిన రాష్ట్ర బీజేపీ శ్రేణులు



**రంగారెడ్డి జిల్లా మహా:** న్యూఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి జితిన్ ప్రసాదను, బీజేపీ మహిళా మోర్చా కార్యాలయ కార్యదర్శి శ్రీమతి దీపిక, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోసుపల్లి ప్రతాప్, మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది అన్నారు. శుక్రవారం కేంద్ర మంత్రులతో రాష్ట్రంలోనే వివిధ విషయాలపై అభివృద్ధి, పలు అంశాలపై చర్చ జరిగింది.




## సుపరిపాలనే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రధానమంత్రి మోడీ

**భూపాలపల్లి జిల్లాలో పీఎం నరేంద్ర మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకాలు**

**మహా:** బిజెపి ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లాలో శుక్రవారం పీఎం నరేంద్ర మోడీ చిత్రపటానికి బిజెపి శ్రేణులు క్షీరాభిషేకం నిర్వహించారు. భూపాలపల్లి పట్టణం, చిట్యాల, రేగొండ, కొంపెల్లి గ్రామాలలో ఆయా మండల శాఖ ల ఆధ్వర్యంలో మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. స్వతంత్రం భారతంలో వచ్చిన విప్లవాత్మక పన్ను సంస్కరణలు నిత్యావసరాలు ఆహార పదార్థాల పై పన్ను 18%,12% నుంచి 5% 0% తగ్గింపు తీసుకురావడం అనేది గొప్ప ఆశించదగ్గ విషయమని బిజెపి నాయకులు ప్రసంగించారు. చిట్యాల మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ యంత్రాలు , స్పే పార్ట్స్, ఎరువుల పై 18% 12% నుంచి 5% కి తగ్గింపు,ఆరోగ్య భీమా, జీవిత భీమా ప్రీమియం పై పన్ను 18% నుండి 0% కి తగ్గింపు,దేశ ప్రజలకు దసరా దీపావళి కానుకగా సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్నాయి అన్నారు. ప్రధానమంత్రి మోడీ ఆగస్ట్ 15 న స్వతంత్ర దినోత్సవ ప్రసంగంలో సూచనప్రాయంగా జీఎస్టీ సంస్కరణల పై మాట్లాడారు. ప్రజలు ఊహించిన దానికంటే తొందరగా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పన్ను తగ్గింపులు చేశారని అన్నారు. కొంపెల్లి గ్రామం లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి శివనాత్రి వేణు, జిల్లా నాయకులు విప్లవ కుమార్ రెడ్డి, చిట్యాల లో బిజెపి సీనియర్ నాయకులు చెక్క నరసయ్య,గజనాల రవీందర్, మార్తా అశోక్, పెరుమాండ్ల రాజు, అనుప మహేష్, చింతల రాజేందర్, కేంసారపు ప్రభాకర్, తీగల వంశీ సేనా రెడ్డి పాల్గొన్నారు.

## మహబూబ్‌పల్లిలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే జీఎస్సార్..**



**భూపాలపల్లి, మహా :** భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని మహబూబ్‌పల్లి లో శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ తో కొమ్ము ప్రమీలకు చెందిన ఇల్లు దగ్ధమైంది. సమాచారాన్నితెలుసుకున్న ఎమ్మెల్యే హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి పరామర్శించారు. ఇంట్లో అగ్నికి కాలిపోయిన బియ్యం, దుస్తులు, టీవీ, ఇతరత్రా సామాగ్రిని ఎమ్మెల్యే పరిశీలించారు. బాధితులకు ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన కుటుంబానికి వెంటనే తగిన సహాయం అందించేందుకు సంబంధిత శాఖల అధికారులను ఫోన్లో లైన్లో ఆదేశించారు. అలాగే, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## జీఎస్టీ తగ్గింపును హర్షిస్తూ పీఎంకు క్షీరాభిషేకం



**మంచిర్యాల, మహా :** భాజపా నరేంద్ర మోడీ ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపును హర్షిస్తూ భారత ప్రధానమంత్రి చిత్రపటానికి మంచిర్యాల భాజపా కార్యాలయంలో శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, మాజీ అధ్యక్షులు రఘునాథ్ ఎర్రబెల్లి లు మాట్లాడుతూ జివిస్టి తగ్గించడం వల్ల మధ్యతరగతి కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. పేద ప్రజల సంక్షేమం కొరకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షనీయమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

## గురువులే భవిష్యత్తుకు మార్గదర్శకాలు

**పూర్వ విద్యార్థి పోలీస్ బాబన్న**



**భూపాల పల్లి మహా;** పిల్లలకు అమ్మ ఒడి తర్వాత భావితరాలకు విద్యాబోధన చేసి భవిష్యత్తును నిర్ణయించేది అలాగే ఆయా వృత్తులలో వారికి తెలిసిన వృత్తి నైపుణ్యాన్ని మరొకరికి నేర్పించి జీవితాన్ని నిలబెట్టేది ఒక గురువు ఒక్కడే అని అలాంటి గురువును పూజించు కోవడం మన భారతీయ సాంప్రదాయం అది మన ధర్మం అని పూర్వ విద్యార్థి పోలీస్ బాబన్న అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కోరు కొప్పుల కావ్య ఆధ్వర్యంలో చిట్యాల మండలం జూకల్ పాఠశాలలో గురుపూజోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. మొదటగా తోట బాబన్న దంపతులు, పూర్వ విద్యార్థుల తో కలిసి ఉపాధ్యాయు లందరికీ శాలువాలు, మెమెంటోలు, పండ్లతో సత్కరించారు. భారతదేశ రెండవ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఈ వేడుకలను పూర్వ విద్యార్థి పోలీస్ బాబన్న నేతృత్వంలో నిర్వహించారు. గతంలో ఈ పాఠశాలలో సేవలందించిన రోకుల సంపత్, బండి రాజమౌళి, మహమ్మద్ ఉస్మాన్ అలీ లను ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు కలిసి సత్కరించడం కార్యక్రమంలో అందరికీ ఆదర్శంగా నిలిచింది. కార్యక్రమానికి మాజీ ఎంపీటీసీ జంబుల తిరుపతి, మాజీ సర్పంచ్ పుట్టపాక మహేందర్, సాయి రెడ్డి ,పోలోజు సంపత్, మేదరి సునీల్, చాడ సమ్మిరెడ్డి, గ్రామ ప్రముఖులు, పాల్గొని గురువుల సేవలను స్మరించుకున్నారు. విద్యార్థులు తమ గురువుల పట్ల కృతజ్ఞతా భావాన్ని వ్యక్తం చేస్తూ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆలోచింపచేసాయి. గురువుల మార్గదర్శకత్వం లోనే విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని హాజరైన వక్తలు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. అనంతరం చదువు చెప్పిన బడికి కృతజ్ఞతగా తోట బాబన్న సతీమణి సంధ్య దంపతులు పాఠశాలకు 22 వేల విలువ గల టీవీని బహుకరించారు.



## అంగరంగ వైభవంగా నిమజ్జనానికి తరలిన వినాయక విగ్రహాలు

**పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం**

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలోని ప్రజలు తొమ్మిది రోజులపాటు వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తి పారవశ్యంతో కొలువుదీరిన గణనాథులు నిమజ్జనానికి తరలడంతో అధికార యంత్రాంగం నిమజ్జనానికై సర్వహంగులను పట్టణంలోని పోచమ్మ చెరువు వద్ద సిద్ధం చేసింది. శుక్రవారం రోజు వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో తరలిన గణనాథులు కు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేలా బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలోని వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు తో పాటు రూరల్ సీఐ హనోక్ లు పటిష్టమైన బందోబస్తును చేపట్టారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేలా వన్ టౌన్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనను కఠినతరం చేశారు గణనాథులు వెళ్లే మార్గంలో ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేలా పోలీసు సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ కొనసాగించారు. పోచమ్మ చెరువు వద్ద గజ ఈత గాళ్ళ సహాయంతో వినాయక విగ్రహాలను క్రేన్ సహాయంతో చెరువులో నిమజ్జనం చేసేందుకు చేసిన ఏర్పాట్లు అందర్నీ సంతృప్తి పరిచాయి. శుక్రవారం ఉదయం నుండే బారులు తీరిన గణనాథులు చెరువులో నిమజ్జనానికై తరలి వెళ్లే క్రమంలో భక్తుల కోలాటాలు నృత్యాలు కొనసాగాయి. నిమజ్జనం ఉత్సవాలను పర్యవేక్షించేందుకు సబ్ కలెక్టర్ మనోజ్ ప్రత్యేక చొరవ తీసుకొని మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ తో పాటు తహసిల్దార్ ఎల్ కృష్ణ లను అగ్నిమాపక సిబ్బ దిని ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించారు.

## నియామక ఉత్తర్వుల పంపిణీకి తరలిన గ్రామ పాలన అధికారులు



**మంచిర్యాల, మహా :** ప్రభుత్వం చేపట్టిన గ్రామ పాలనాధికారులకు నియామక ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమానికి గ్రామ పాలన అధికారులు హైదరాబాదుకు తరలి వెళ్లారని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం నుండి 3 బస్సులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల తహసిల్దారులు దిలీప్ కుమార్, శ్రీనివాసరావు దేశ్ పాండేలతో కలిసి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ లోని హైటెక్ సిటీలో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులమీదుగా గ్రామ పాలనా అధికారులకు నియామక ఉత్తర్వులు పంపిణీ చేయడం జరుగుతుందని వెల్లడించారు. గ్రామ పాలనాధికారుల పోస్టింగ్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిబంధనలకు లోబడి నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా నుండి 124 మంది గ్రామ పాలనాధికారులు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యేందుకు 3 బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రతి బస్సులో ఒక ఉపతహసిల్దార్, ఒక పోలీస్ కానిస్టేబుల్ ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి వెళ్లి వచ్చే గ్రామ పాలన అధికారులకు భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలభిషేకం



**బెల్లంపల్లి, మహా:** దేశంలో జీఎస్టీ పై సంస్కరణలు తీసుకువచ్చిన భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి తాండూర్ బిజెపి నాయకులు శుక్రవారం రోజు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఐబి సెంటర్ లో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్ ఆధ్వర్యంలో పాలభిషేకం చేసి హర్షం వ్యక్తంచేశారు. పేద మధ్యతరగతి ప్రజలకు మేలు చేకూర్చే విధంగా దీపావళి కానుకగా కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ జీఎస్టీ పై సంస్కరణలు తీసుకురావడం హర్షించ దగిన విషయమని అన్నారు. రైతుల నుంచి వ్యాపారుల దాకా ఇళ్ల నుండి కంపెనీల దాకా అందరికీ లాభదాయకం అని అన్నారు. అట్టడుగు వర్గాల పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా బిజెపి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. దేశ ప్రజలకు నరేంద్ర మోడీ చారిత్రాత్మక దీపావళి బహుమతి ఇస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి రామ గౌని మహీధర్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు చిలువేరు శేషగిరి,పులగం తిరుపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధం మల్లేష్,సంఘర్ష్ శీతల్,ఎస్సీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి పాగిడి చిరంజీవి, సీనియర్ నాయకులు కేశెట్టి విజయ్ కుమార్,ఆవుల చందు,బోనగిరి విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే మార్గదర్శకులు గురువులు

**నగర మేయర్ జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ ఎమ్మెల్యే.. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా గురు పూజోత్సవం**




**వరంగల్ మహా;** దేశ భవిష్యత్తును తరగతి గదుల్లోని , విద్యార్థులను తీర్చిదిద్దే మార్గదర్శకులు గురువులని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం లో భాగంగా వరంగల్ నగరంలోని ఆకుతోట ఫంక్షన్ హాల్లో శుక్రవారం మేయర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి లతో కలసి జ్యోతి ప్రజలను చేసి గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతోపాటు విలువైన జ్ఞానాన్ని నేర్పించేది గురువులని అన్నారు. గురు బ్రహ్మ గురు విష్ణు గురుదేవో మహేశ్వర గురువుల స్థానం ఎంతో గొప్పదో తెలియజేస్తుంది అన్నారు. ఒక విద్యార్థి జీవితాన్ని మారుస్తుంది చదువు కాదు చదువు నేర్పించే గురువు అని అన్నారు. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే గురువుల మనకు జీవితం బోధిస్తారు అన్నారు. గురువు లేకుండా సమాజానికి మార్గం ఉండదని వారి జీవితాలే విద్యార్థులకు బోధనలుగా నిలుస్తాయని, గురువుల సేవలు ఎన్నటికీ మరువలేమని తెలిపారు. గురువుల తయారు చేస్తున్న విద్యార్థులే రేపటి డాక్టర్లు ఇంజనీర్లు శాస్త్రవేత్తలు నాయకులు దేశ సేవకులను అన్నారు. విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు విద్యా విధానంలో ఎన్నో వినూత్న మార్పులు తీసుకొస్తున్నారని అన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అవసరమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయులకు శిక్షణ, ఉపాధ్యాయుల నియామకం చాళ్లల్లో మౌలిక సదుపాయాల కల్పన చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వెంటికన్నా ఎక్కువమంది పిల్లలు ఉన్న 571 గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభించుకోవడం జరిగిందని అన్నారు. నాణ్యమైన భోజనం, యూనిఫామ్ లు, కొత్త డైట్ మెనూ, విద్యార్థులకు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా పేదలందరికీ ఒకే చోట అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో అత్యంత ప్రామాణికమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 21 వేల కోట్ల రూపాయల వ్యయంతో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తూ కొత్త విద్య యుగానికి నాంది పలుకుతున్నట్లు అన్నారు. డైట్ చార్జీలను,కాస్మెటిక్ చార్జీలను పెంచడం జరిగిందని గుర్తు చేశారు . అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. మంచి సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు నైతిక విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని ముఖ్యంగా ప్రతి భావం తులుగా మనందరినీ తీర్చిదిద్దిన గురువులను ఈరోజు స్మరించుకొని సత్కరించుకోవడం చాలా ఆనందాన్నిస్తుందని పేర్కొన్నారు.

## నాలాలపై అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేతలు తప్పవు

**బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్**



**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి పట్టణంలో నాలాలపై అక్రమ నిర్మాణాలు చేప డితే కూల్చివేయక తప్పదని సబ్ కలెక్టర్ మనోజ్ హెచ్చరించారు. బెల్లంపల్లి పట్టణంలోని ఎస్బిఐ బ్యాంకు పక్కన నాన్లపై అక్రమ నిర్మాణం చేపడుతున్న అంశంపై సీఎం రేవంత్ రెడ్డి సైన్యం కార్యదర్శి ,కాంగ్రెస్ నాయకుడు కొలిపాక శ్రీనివాస్ ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా సబ్ కలెక్టర్ మనోజ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భం గా పలువురు వ్యాపారులు వర్షాలు వచ్చిన సందర్భంలో ఇళ్లలోకి మురుగునీరు చేరుతున్నదని అక్రమంగా నాలాలపై నిర్మాణాలు చేపట్టడంతో నాలాలు కుదించుకు పోవడంతో మురుగునీరు అంతా దుకాణసముదా యాల్లోనికి ఇలలోకి చేరుతుందని ఆవే దన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అంశంలో మున్సిపల్ తోపాటు రెవెన్యూ యంత్రాంగం అక్ర మ నిర్మాణాలపై నివేదికనురూపొందిం చి అందజేయాలని ఆయన ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలో అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా సహించేది లేదని ప్రభుత్వ భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను మరియు నాలాలపై నిర్మాణాలు ఉన్నట్లయితే వాటిని తొలగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. పట్ట ణంలో లోని ప్రభుత్వ భూముల్లోనూ అక్రమ నిర్మాణాలు చేపట్టిన పక్షంలో నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. సంబంధిత అంశంలో జిల్లా కలెక్టర్కు పూర్తిస్థాయి నివేదికను త్వరలోనే అందజేసి చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ తో పాటు బెల్లంపల్లి తాసిల్దార్ ఎల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వినాయకునికి బాయిజమ్మ ట్రస్ట్ ఘన వీడ్కోలు

**సాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నిమజ్జన వేడుకలు.. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు, సేవకులు, కాలనీ ప్రజలు**



**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి పట్టణంలోని రైల్వే రడగం బాల బస్తీ లోని సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ భవన్ వద్ద ఏర్పాటు చేసిన గణేషునికి ఘనంగా వీడ్కోలు పలికారు. ట్రస్టు భవన్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం నిమజ్జన వేడుకలను ప్రారంభించి స్థానిక బెల్లంపల్లి బస్తి చెరువులో నిమజ్జనం చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శంకర్‌రాజేశ్వరి ల ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ట్రస్టు ఆధ్వర్యంలో గత 9 రోజులుగా గణపతి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా చివరి రోజైన శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి విభిన్నమైన వివిధ ప్రసాదాలను సమర్పించారు. అనంతరం నిమజ్జన శోభా యాత్రను ప్రారంభించారు. విగ్రహదాత నాగరాజును సన్మానించారు. ..నవరాత్రి వేడుకలు విజయవంతం.. ఈ సందర్భంగా బాయిజమ్మ సాయి సేవా ట్రస్టు వ్యవస్థాపకులు ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శంకర్ రాజేశ్వరి మాట్లాడుతూ, తమ ట్రస్టు ఆధ్వర్యంలో ఏటా గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నా మని తెలిపారు. ట్రస్ట్ సేవకులు,సాయి భక్తులు పాల్గొని విజయవంతం చేశా రని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రముఖ విద్యావే త్తలు డాక్టర్ కాంపల్లి శంకర్‌రాజేశ్వరి, సేవకులు, భక్తులు, రాజకీయ ప్రము ఖులు, బస్తీ ప్రజలు పాల్గొన్నారు. ట్రస్ట్ వారు దాతలకు, పోలీసు సిబ్బందికి, ప్రభుత్వ ఎలక్ట్రికల్స్ సిబ్బందికి, మీడియా వారికి, భక్తులకు ధన్యవాదాలు తెలియజేశారు.

# నిమజ్జనానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు

## నిమజ్జన ప్రక్రియను ప్రారంభించిన మేయర్, జిల్లా కలెక్టర్, కమీషనర్



**వరంగల్ మహా;** నిమజ్జనానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద లు తెలిపారు. శుక్రవారం వరంగల్ పరిధి చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద టెంకాయ సమర్పించి నిమజ్జనాన్ని మేయర్, కలెక్టర్, మున్సిపల్ కమీషనర్ లు సంయుక్తం గా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక నిమజ్జనానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయడం జరిగిందని ఇందుకోసం పది రోజుల ముందుగానే రూ. 1కోటి 20 లక్షలు కార్పొరేషన్ ద్వారా కేటాయించి వివిధ శాఖల సమన్వయంతో పనిచేసేలా ప్రతి డిపార్ట్మెంటును సమన్వయం చేసుకుంటూ లైటింగ్ ఏర్పాట్లు, సివిల్ పనులు, క్రేన్ల ఏర్పాటు చేయడమే కాకుండా ప్రతి నిమజ్జన ప్రాంతం (పాయింట్)లో కార్పొరేషన్ ద్వారా నోడల్ అధికారులను ఏర్పాటు చేయడం జరిగిందని పూర్తిస్థాయిలో నిమజ్జనం అయ్యే విధంగా వారు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటారని నిమజ్జన ప్రాంతంలో మత్స్యశాఖ ద్వారా గజ ఈత గాళ్లను అందుబాటులో ఉంచడం జరిగిందని, ఇరిగేషన్ అధికారులను కూడా అందుబాటులో ఉంచామని కమిషనర్ ఆఫ్ పోలీస్ ట్రాఫిక్ లో ఇబ్బందులు లేకుండా చూస్తున్నారని, పోలీస్ ఇరిగేషన్ మైన్స్ ఫిషరీష్ కార్పొరేషన్ తో సహా అన్ని విభాగాల అధికారుల సమన్వయం తో అత్యంత భక్తి శ్రద్ధలతో పండగ వాతావరణం లో నిమజ్జనం శనివారం మధ్యాహ్నం వరకు జరుగుతుందని సాంప్రదాయం గా చిన్న వడ్డేపల్లి చెరువులోని నిమజ్జనాన్ని ప్రారంభించడం ఆనవాయితీగా వస్తుందని, నిమజ్జనం సందర్భంగా టెంకాయ సమర్పించి ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్లు సురేష్ జోషి, కావేటి కవిత బస్వరాజు కుమారస్వామి, డి సి పి. షేక్ సలీమా, సి ఏం హెచ్ ఓ డా. రాజారెడ్డి ఏ సి పి శుభం, ఇరిగేషన్ బల్దియా ఈ ఈ లు కిరణ్ భీమ్ రావు ఏం హెచ్ ఓ డా. రాజేష్ ట్రాఫిక్ ఏ సి పి సత్యనారాయణ తహసిల్దార్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

# మిలాదున్ నబి వేడుకల్లో పాల్గొన్న నన్నపునేని



**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఉర్సు చామన్ లో కొత్తగా నిర్మించబడిన కమల్ పాషా హవెలిలో మిలాదున్ నబి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో హజరత్ సైద్ షా యాహియా పాషా నబిరా ఖాద్రి సాహెబ్ ఆహ్వానం మేరకు, గ్రేటర్ వరంగల్ తొలి మేయర్ వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ మైనారిటీ సోదరులకు మిలాదున్ నబి పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రవక్త మహమ్మద్ ప్రవక్త జీవన సందేశం మనందరికీ శాంతి, సోదరభావం, సేవా భావం నేర్పిస్తుందని సమాజంలో సామరస్యాన్ని నెలకొల్పే ఈ పండుగ అందరికీ మంగళం చేకూర్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ మత పెద్దలు, స్థానిక మత నాయకులు, మైనారిటీ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు.



# కాళేశ్వరంలో ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవం

**కాటారం, మహా :** తొమ్మిది రోజులు భక్తుల పూజలు అందుకున్న గణేష్ విగ్రహాలకు శుక్రవారం ఘనంగా పూజలు చేశారు. అందంగా అలంకరించిన వాహనాలలో విగ్రహాలను ఉంచి వీధులలో ఊరేగింపు నిర్వహించారు. వినాయక విగ్రహాలు ఉంచిన వాహనాల ముందు భక్తుల భజన సంకీర్తనలు.. దాండియా నృత్యాలు..కోలాటాలు మహిళలు ప్రదర్శన చేస్తూ ఘనంగా శోభాయాత్ర నిర్వ హించారు... శోభాయాత్ర నిర్వహించిన అనంతరం కాళేశ్వరం లోని అంతరాష్ట్ర వంతెన వద్ద గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. భూపాలపల్లి జిల్లాలోని వివిధ గ్రామాలలో నవరాత్రి ఉత్సవాలలో పూజలు చేసిన విగ్రహాలను కాళేశ్వరంలో నిమజ్జనం చేశారు కొన్ని గ్రామాల్లో గ్రామ ఊర చెరువులలో. గణపురం మండలంలోని గణపసముద్రం చెరువులో నిమజ్జనం నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా భూపాల పల్లి జిల్లాలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గణేశుని శోభాయాత్రలో డిజె సౌండ్ పెద్దగా ఉంచకుండా పోలీసులు నియంత్రించారు అధిక ధ్వనితో ఇబ్బందులు పెట్టే వారికి పోలీసులు హెచ్చరికలు చేశారు. కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గారెపల్లి కూడలి లో వైద్య శిబిరం నిర్వహించారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు.

# గంగమ్మ ఒడిలోకి గణపయ్యలు

## వాడవాడలా అంబరాన్నంటిన వేడుకలు.. కనుల పండువగా శోభా యాత్రలు

### డప్పు చప్పుళ్లతో కేరింతలు కొట్టిన చిన్నాపెద్దా





**వరంగల్ హన్మకొండ మహా;** తీరొక్క నైవేద్యాలతో ప్రత్యేక పూజలు, హోమాలు చేసిన భక్తులు తొమ్మిది రోజులపాటు విశేష పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. వరంగల్ ఉమ్మడి జిల్లాల్లో విఘ్నేశ్వరుడికి నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. వివిధ పూలు చెట్ల కొమ్మలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో వినాయక విగ్రహాలను ఉంచి కనుల పండుగలా శోభా యాత్రలు నిర్వహించారు. దారి పొడువునా బాణాసంచా కాల్చుతూ, డప్పు చప్పుళ్లు, కోలాటాలు నృత్యాలతో చిన్నాపెద్దా తేడా లేకుండా కేరింతలు కొట్టారు. గణనాథులకు ఉత్సవ సమితి నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేసి దారి పొడుగునా అన్న ప్రసాద వితరణ చేశారు. ముఖ్యంగా వరంగల్ నగరం 28వ డివిజన్ లోని ఫ్రెండ్ యూనిట్ కమిటీ సభ్యులు గత 43 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవంలో భాగంగా 9వ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించి 2000 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గణపతిని ఉంచి సుమారు 500 మంది మహిళలతో నిర్వహించిన శోభయాత్రలో కోలాటాలు నృత్యాల మధ్య కార్పొరేటర్ గందె కల్పన నవీన్ ఎంతో ఉత్సాహంగా ఆడి పాడి ఉర్రూతలూగించారు. అలాగే దేశాయిపేట రోడ్డు వర్తక సంఘం, శాశ్వత అధ్యక్షుడు డాక్టర్ లయన్ ఆడెపు రవీందర్, గణపతి వర్తక సంఘం అధ్యక్షుడు వేల్పుగొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గణనాధుని శోభాయాత్ర నిర్వహించి భారీ గణపతులను నిమజ్జనం చేశారు. అంతేకాకుండా హనుమకొండ నగరం లోని అంబేద్కర్ జంక్షన్, కుమార్ పల్లి మార్కెట్, ఏర్పాటు చేసిన భారీ గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ముఖ్యంగా భారీ పోలీస్ బందోబస్తుల మధ్య దేశాయిపేట లోని చిన్న వడ్డేపల్లి, మధ్య కోటలోని ఏకశిల, ఉర్సు, మామునూరు లోని బెస్తం, పెద్దావి చెరువు, కోనారెడ్డి, ఇల్లంద పెద్ద చెరువు, గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ కట్టమల్లన్న, ఎల్గూరు చెరువు, పాకా ల వాగు, సర్వాపురం శివారు దామెర, తదితర చెరువుల్లో గణ నాథులను నిమజ్జనం చేశారు. 'జై బోలో గణేశ్ మహరాజ్ కీ.. గణపతి బప్పా మోరియా.. అంటూ నినదిస్తూ గంగమ్మ ఒడికి సాగనంపారు.



# కమాండ్ కంట్రోల్ నుండి శోభాయాత్రను పరిశీలించిన సీపీ, మేయర్

**వరంగల్ హన్మకొండ మహా;** గణేష్ నిమజ్జనం మరి శోభాయాత్రకు సంబంధించి పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను, నిమజ్జన ప్రాంతాలు, శోభాయాత్ర నిర్వహించే మార్గాలలో ప్రస్తుత స్థితిగతులపై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీతి సింగ్ శుక్రవారం పోలీస్ కమిషనరేట్ కమాండ్ కంట్రోల్ నుండి పర్యవేక్షించారు. అలాగే నగర మీరు గుండు సుధారాణి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లోని కమాండ్ కంట్రోల్ నుండి నిమర్జనం శోభాయాత్ర ను తిలకించారు. ఈ సందర్భంగా నిమజ్జనాని కై ఏర్పాటు చేసిన 583 సీసీ కెమెరాలకు సంబంధించిన దృశ్యాలను కమాండ్ కంట్రోల్ ద్వారా పోలీసులు తిలకిస్తారని సిపి పేర్కొన్నారు.

# నేరం చేస్తే శిక్ష పడుతుందనే భయాన్ని నేరస్తులకు కలిగించాలి

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్






**హన్మకొండ మహా;** ఎవరైనా ఎదైన నేరం చేస్తే కోర్టులో శిక్ష పడుతుందనే భయాన్ని నేరస్తులకు కలిగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు. ఈ ఏడాది జనవరి నెల నుండి ఆగస్టు నెల వరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ న్యాయ స్థానాల్లో జరిగిన ట్రయల్స్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడటంలో కృషి చేసిన పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల అభినందన సభను వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిధిగా పాల్గొని నిందితులకు కోర్టులో శిక్షలు పడటంలో కృషి చేసిన జాయింట్ డిప్యూటీ డైరక్టర్, డిప్యూటీ డైరక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, దర్యాప్తు అధికారులు, కోర్టు, ప్రాసెస్ విధులు నిర్వహించే పోలీస్ అధికారులను వరంగల్ పోలీస్ కమిషనర్ కమిషనర్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించి ప్రశంస పత్రాలను అందజేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ గతంలో ఏన్నడూ లేని విధంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ నేరాలకు పాల్పడిన నేరస్తులకు కోర్టులో శిక్షలు పడిన శాతం పెరిగిందని. ఇది ఏ ఒక్కరి వలన జరిగిందని కాదని. ఏవరికి వారు వారికి అప్పగించిన విధులను బాధ్యతయుతంగా నిర్వర్తించడం ద్వారా ఇలాంటి మెరుగైన ఫలితాలను రావడం జరిగిందని. కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది జరిగిన ట్రయల్ కేసుల్లో మొత్తం 16 కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయని. ఇందులో 6 హత్య కేసుల్లో ఐదు కేసుల్లో యావజ్జీవ కారాగార శిక్ష పడగా, ఒక కేసులో పది సంవత్సరాల జైలు శిక్షను కోర్టు విధించగా, నాలుగు ఆత్యాచారం కేసుల్లో రెండు కేసుల్లో జీవితఖైదు, మరో రెండు కేసుల్లో ఇరువై సంవత్సరాల జైలు విధించగా, ఎస్టీ, ఎస్సీ మానభంగం కేసులో ఏడు సంవత్సరాలు, చోరీ ఇతర కేసులకు సంబంధించి ఐదు కేసుల్లో మూడు సంవత్సరాల చోప్పున జైలు విధించడం జరిగిందని. నిందితులకు శిక్షలు పడటం ద్వారా బాధితులను న్యాయం జరగడంతో పాటు కోర్టు, పోలీసులపై ప్రజలకు నమ్మకం గౌరవం పెరుగుతుందని. నేరస్తులకు పడటం కోసం పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంలో పనిచేయాల్సిన అవసరం వుందని. ఇందుకోసం ఇన్స్పెక్టర్ స్థాయి పోలీస్ అధికారిని కోర్టు మానిటరింగ్ అధికారిగా నియమించడం జరిగిందని పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ కార్యక్రమములో అదనపు డిసిపి రవి, వరంగల్ ప్రాసిక్యూషన్ ఆఫ్ జాయింట్ డిప్యూటీ డైరక్టర్ రాములు, సంగారెడ్డి జిల్లా ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరక్టర్ సత్యనారయణ, సిసిఆర్బి ఏసిపి డేవిడ్ రాజు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సంతోషి, శ్రీనివాస్, వాసుదేవ రెడ్డి, పావని, రాజమల్లా రెడ్డి, దుర్గాబాయి, భరోసాకేంద్రం న్యాయధికారి నీరజ, ఇన్స్పెక్టర్లు శ్రీధర్, ముస్కా శ్రీనివాస్, రవికుమార్, కరుణాకర్, పుల్యాల కిషన్, ఎస్.ఐ నర్సింహ రావుతో పాటు సిసిఆర్బి సిబ్బంది, కోర్టు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డ్స్ పాల్గోన్నారు.



# నిమజ్జనం వద్ద పోలీసుల భారీ బందోబస్తు

**వరంగల్ మహా;** వరంగల్ చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద నిమజ్జనం ఏర్పాట్లను వరంగల్ సబ్ డివిజన్ ఏఎస్పి శుభం ప్రకాష్ నేతృత్వంలో ఇంతే జార్గంజ్ ఇన్స్పెక్టర్ ఎంఎ షుకూర్, వరంగల్ ట్రాఫిక్ సిఐ కే సుజాత గత నాలుగు రోజులుగా స్వయంగా నిమజ్జనం ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. శుక్రవారం మొదలైన నిమజ్జనం సందర్భంగా వరంగల్ ఇంతేజార్ గంజ్ పోలీసు స్టేషన్ సిఐ షుకూర్ తో పాటు ట్రాఫిక్ పోలీసులు ఇతర పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, పెద్ద ఎత్తున పోలీసు సిబ్బంది విధులు నిర్వహించారు. నిమజ్జనం వేళ ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముఖ్యంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# పైలెట్ పాడుపని.. సిగరెట్ లైటర్ స్పై కెమెరాలతో..



**ఢిల్లీ:** నగరంలో ఓ పైలట్ వికృత చేష్టలు వెలుగులోకి వచ్చాయి. పైలెట్ మోహిత్ ప్రియదర్శిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. మాల్స్‌కు వచ్చే యువతులను టార్గెట్ చేసిన మోహిత్.. స్పై కెమెరాతో యువతుల వీడియోలు తీస్తూ.. కీచకుడి అవతారం ఎత్తాడు. సిగరెట్ లైటర్ ఆకారంలో ఉన్న స్పై కెమెరాలతో వీడియోలు చిత్రీకరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇటీవల ఢిల్లీలోని కిషన్‌గఢ్ ప్రాంతంలోని శని బజార్‌లో మోహిత్ లైటర్‌తో మహిళల వీడియోలను రికార్డ్ చేయడాన్ని ఓ యువతి గమనించింది. వెంటనే అప్రమత్తమైన ఆ మహిళ.. పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకునేలోపే నిందితుడు పరారయ్యాడు. అనంతరం మార్కెట్‌లోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులు నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. మోహిత్ ప్రియదర్శి.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు నిర్ధారించారు. విచారణలో నిందితుడు ఓ ప్రముఖ ప్రైవేట్ ఎయిర్‌లైన్స్‌లో పైలట్‌గా పనిచేస్తున్నట్లు తేలింది. నిందితుడు ప్రియదర్శికి ఇంకా పెళ్లి కాలేదని తెలిపారు. మోహిత్ వద్ద నుంచి స్పై కెమెరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో మహిళలకు సంబంధించిన అనేక అభ్యంతరకర వీడియోలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు ప్రియదర్శికి ఇంకా పెళ్లి కాలేదని తెలిపారు.

# పెట్టుబడులు పెట్టండి

## గల్ఫ్ పారిశ్రామికవేత్తలు, ఎన్‌ఆర్‌ఐలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం

**మహా:** రైజింగ్ తెలంగాణ'లో భాగస్వామ్యం కావాలని గల్ఫ్ పారిశ్రామికవేత్తలు, ప్రవాస భారతీయులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. పరిశ్రమల ఏర్పాటుకు అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. 'సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ వీకెండ్ - దుబాయి 2025'లో భాగంగా యూఏఈలో నిర్వహించిన సౌత్ ఇండియన్ బిజినెస్ అచీవర్స్ అవార్డు (సైబా)ల ప్రదానోత్సవానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలుస్తున్న తెలంగాణ పురోగతిని, భవిష్యత్ ప్రణాళికలను ఈ సందర్భంగా మంత్రి వివరించారు. 'భౌగోళిక విస్తీర్ణంలో 11, జనాభా పరంగా తెలంగాణ 12వ స్థానంలో ఉంది. అయినా... దేశ జీడీపీలో మా వాటా 5 శాతం కంటే ఎక్కువే. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీఎస్ డీపీ వృద్ధి రేటు 8.2 శాతంగా నమోదయ్యింది. ఇది జాతీయ సగటు కంటే ఎక్కువ. గత 18 నెలల్లో తెలంగాణ లైఫ్ సైన్సెస్, ఈవీ, ఏరోస్పేస్, లాజిస్టిక్స్, ఏఐ, పునరుత్పాదక ఇంధనం తదితర రంగాల్లో రూ.3.28 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది' అని చెప్పారు. 'ఎలీ లిల్లీ లాంటి అనేక ప్రపంచ దిగ్గజ సంస్థలు తెలంగాణను తమ గమ్యస్థానంగా మార్చుకున్నాయి. ఇప్పటికే యూఏఈ పెట్టుబడిదారులు రూ.2వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టారు. ఇది తెలంగాణ దుబాయ్ మధ్య రోజురోజుకీ బలపడుతున్న వాణిజ్య సంబంధాలకు చిహ్నంగా భావిస్తున్నాం' అని చెప్పారు. 'ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే వారిని మేం కేవలం వ్యాపారవేత్తలుగా మాత్రమే చూడటం లేదు. మా రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామిగా పరిగణిస్తున్నాం. ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీస్, సైబర్ సెక్యూరిటీ, ఫిన్‌టెక్, డిజిటల్ ఎకానమీ, స్మార్ట్ మొబిలిటీ, క్లీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, లాజిస్టిక్స్, వేర్ హౌజింగ్, ట్రేడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, ఫుడ్ ప్రాసెసింగ్, ఈవీ, ఏరో స్పేస్, డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్ తదితర రంగాల్లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటాం. తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలి' అని పిలుపునిచ్చారు.

# తెలంగాణలో ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహించండి

## క్రీడల అభివృద్ధికి రాష్ట్రానికి నిధులు కేటాయించాలి

### కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవియాను కోరిన మంత్రి వాకిటి శ్రీహరి



**ఢిల్లీ, మహా:** ఖేలో ఇండియా 8వ ఎడిషన్‌ను తెలంగాణకు కేటాయించాలని, క్రీడల అభివృద్ధికి నిధులు కేటాయించాలని తెలంగాణ క్రీడలు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి.. కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియాను కోరారు. మంత్రి వాకిటి శ్రీహరి ఢిల్లీలో మన్‌సుఖ్ మాండవియాతో ఆయన అధికారిక నివాసంలో సమావేశమయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'ఢిల్లీలో కేంద్ర క్రీడా శాఖ మంత్రితో సమావేశమయ్యి ఖేలో ఇండియా ఎనిమిదవ ఎడిషన్‌ను తెలంగాణకు కేటాయించాలని విజ్ఞప్తి చేశాం. ఇదివరకే ఈ అంశం గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మన్‌సుఖ్ మాండవియాను కలిసి విజ్ఞప్తి చేశారు. తాజాగా క్రీడల శాఖ మంత్రిగా నేను కేంద్రమంత్రిని కలిసి వచ్చే సంవత్సరం ఖేలో ఇండియా క్రీడలను నిర్వహించడానికి తెలంగాణ అన్ని విధాలుగా అనువైన ప్రదేశం అని వారికి మరోసారి వివరించి వచ్చే సంవత్సరం ఖేలో ఇండియా ఎనిమిదవ ఎడిషన్ క్రీడలను తెలంగాణకు కేటాయించాలని విజ్ఞప్తి చేశాం. తెలంగాణలోని హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్, వనపర్తి సహా ఇలా వివిధ జిల్లాల్లో ఉన్న క్రీడా పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు అమిత ప్రాముఖ్యతను ఇస్తూ రాష్ట్ర క్రీడా పాలసీ ని స్వయంగా పర్యవేక్షించి తయారు చేయించారు . స్టేడియాలు నిర్మించాలని పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అందుకు అనుగుణంగా.. తెలంగాణ స్పోర్ట్స్ పాలసీని రూపొందించినట్టు కేంద్రమంత్రికి వివరించాం. నిధులు కావాలని కోరాం. మా విజ్ఞప్తులకు మన్‌సుఖ్ మాండవియా సానుకూలంగా స్పందించారు. 3 రోజుల షెడ్యూల్‌తో తెలంగాణకు వస్తామని చెప్పారు" అని మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు.


# మోదీ సర్కార్ మెగా డిఫెన్స్ ప్లాన్ రెడీ

**ఢిల్లీ:** మోదీ సర్కార్ 15 ఏళ్ల ప్రణాళికను ఆవిష్కరించింది. సైనిక దళాల ఆధునికీకరణకు భారత రక్షణ మంత్రిత్వ శాఖ మెగా డిఫెన్స్ ప్లాన్ రూపొందించింది. న్యూక్లియర్ వార్ షిప్స్, హైపర్ సోనిక్ మిస్సైల్స్, లేజర్, రోబోటిక్స్, ఏఐ ఆయుధాలతో భారీ ప్రణాళిక సిద్ధం చేసింది. నౌక దళం కోసం సరికొత్త ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్ నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ అనంతరం మోదీ ప్రభుత్వం అతిపెద్ద రక్షణ అభివృద్ధి ప్రణాళికను ప్రకటించింది. దీని ద్వారా భారత సాయుధ దళాలను బిలియన్ల డాలర్ల పెట్టుబడితో అత్యాధునిక సాంకేతికతతో ఆధునీకరించనున్నారు. ఈ రోడ్ మ్యాప్ ప్రకారం, భారత్ తన ఆయుధాగారంలోకి అణుశక్తితో నడిచే యుద్ధ నౌకలు, నెక్స్ట్ జనరేషన్ యుద్ధ ట్యాంకులు, హైపర్‌సోనిక్ క్షిపణులు, స్టెల్త్ బాంబర్ డ్రోన్లు, AI ఆధారిత ఆయుధాలు, అంతరిక్ష ఆధారిత యుద్ధ సాంకేతికతను చేర్చనుంది. భారత సైన్యం.. టి72 యుద్ధ ట్యాంకులకు బదులుగా దాదాపు 1,800 అత్యాధునిక ట్యాంకులను, పర్వత ప్రాంత యుద్ధం కోసం 400 తేలికపాటి ట్యాంకులను, 50,000 ట్యాంకులకు అమర్చే యాంటీట్యాంక్ గైడెడ్ క్షిపణులను, 700 రోబోటిక్ కౌంటర్IED వ్యవస్థలను చేర్చుకోనుంది. నౌకా దళం ఒక కొత్త విమాన వాహక నౌక, 10 అధునాతన యుద్ధ నౌకలు, 7 ఆధునిక కార్వెట్‌లు, 4 ల్యాండింగ్ డాక్ ప్లాట్‌ఫారమ్‌లను పొందనుంది. యుద్ధ నౌకల కోసం అణు చోదక వ్యవస్థ, ఎలక్ట్రోమాగ్నెటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ లాంచ్ సిస్టమ్‌లకు కూడా ఆమోదం లభించింది.

# దేశంలోని టాప్ టెన్ బిలియనీర్ మంత్రులలో నలుగురు ఏపీ వాళ్లే

**అమరావతి, మహా:** దేశంలోని రాజకీయ నేతల ఆస్తులు, అప్పులు, క్రిమినల్ కేసులు వంటి వివరాలను అందించే అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ తాజాగా మరో నివేదికను వెల్లడించింది. నేషనల్ ఎలక్షన్ వాచ్ తో కలిసి ఏడీఆర్ ఈ రిపోర్టు వెల్లడించింది. ఏడీఆర్ న్యూ నివేదిక ప్రకారం.. దేశంలోనే అత్యధిక మంది బిలియనీర్ మంత్రులను (రూ.100 కోట్లకు పైగా) కలిగిన రాష్ట్రంగా కర్ణాటక ఉంది. ఆ తర్వాతి స్థానంలో (రెండో స్థానం) ఆంధ్రప్రదేశ్ కొనసాగుతూ ఉండటం విశేషం. అలాగే దేశంలో ఎక్కువమంది బిలియనీర్ మంత్రులు ఉన్న పార్టీల జాబితాలో తెలుగుదేశం రెండో స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ విషయానికి వస్తే.. రాష్ట్రంలోని 25 మంత్రులలో ఆరుగురు బిలియనీర్లేనని నివేదిక వెల్లడించింది. ఏపీ మంత్రివర్గంలో సీఎం చంద్రబాబుతో కలిపి టీడీపీకి 21 మంది మంత్రులు ఉన్నారు. జనసేనకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో పాటుగా ముగ్గురు మంత్రులు ఉండగా.. భారతీయ జనతా పార్టీకి సత్యకుమార్ యాదవ్ ఒక్కరే మంత్రివర్గంలో కొనసాగుతున్నారు. అయితే టీడీపీకి ఉన్న 21 మంది మంత్రులలో ఐదుగురికి రూ.100 కోట్లకుపైగా ఆస్తులు ఉన్నట్లు ఏడీఆర్ నివేదిక వెల్లడించింది. జనసేన మంత్రులలో ఒకరు బిలియనీర్ అని వెల్లడించింది. ఏడీఆర్ రిపోర్టు ప్రకారం దేశంలోనే అత్యధిక మొత్తంలో ఆస్తులు ఉన్న మంత్రిగా.. ఏపీకి చెందిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. అత్యధిక మొత్తంలో అప్పులు కూడా ఆయనకే ఉండటం విశేషం. అలాగే దేశంలోని టాప్ టెన్ బిలియనీర్ మంత్రుల జాబితాలో నలుగురు ఏపీకి చెందిన వారు కావటం విశేషం. పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటుగా.. సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేష్, పొంగూరు నారాయణ ఈ జాబితాలో ఉన్నారు. కేంద్ర మంత్రివర్గంలోని ఇద్దరితో కలిపి టీడీపీ మంత్రులలోని 96 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఏడీఆర్ నివేదిక తేల్చింది. ఇది దేశంలోనే అత్యధికమని పేర్కొంది. టీడీపీకి చెందిన మంత్రులలో టీజీ భరత్ మినహా మిగతా అందరిపై క్రిమినల్ కేసులు నమోదైనట్లు నివేదిక వెల్లడించింది. ఎన్నికల సమయంలో అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ ఈ నివేదిక వెల్లడించింది. 27 రాష్ట్రాల్లోని మంత్రులు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాలు, కేంద్ర మంత్రులు మొత్తం 643 మంది సమర్పించిన అఫిడవిట్లను పరిశీలించిన అనంతరం ఈ నివేదిక వెల్లడించారు. ఎన్నికల సమయంలో తమపై నమోదైన కేసుల వివరాలతో పాటుగా ఆస్తులు, అప్పులు, చదువుకు సంబంధించిన వివరాలను అభ్యర్థులు అఫిడవిట్లో పొందుపరచాల్సి ఉంటుంది. ఈ అఫిడవిట్లను పరిశీలించిన అనంతరం ఏడీఆర్ ఈ నివేదికను వెల్లడించింది. టీడీపీకి చెందిన రాష్ట్ర మంత్రులు 21 మందితో పాటుగా కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌లను కూడా కలుపుకుంటే మొత్తం 23 మంది అవుతారు. 23 మందిలో 22 మందిపై క్రిమినల్ కేసులు నమోదైనట్లు ఏడీఆర్ నివేదిక తెలిపింది. 13 మందిపై సీరియస్ అభియోగాలు ఉన్నట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలోని బీజేపీ మంత్రిపై ఎలాంటి కేసులు లేవని వెల్లడించింది. రాష్ట్ర మంత్రివర్గంలో టీడీపీకి చెందిన ఒక మంత్రి, బీజేపీకి చెందిన ఒక మంత్రి, జనసేనకు చెందిన ఒక మంత్రిపై ఎలాంటి కేసులు లేవని ఏడీఆర్ నివేదిక వెల్లడించింది.

# రాజమౌళి సార్ మాస్టర్ అయితే..
# మేమంతా విద్యార్థులం..



టాలీవుడ్ దర్శకధీరుడు రాజమౌళిపై ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఇండియన్ సినిమాకు ఆయన ఒక బెంచ్ మార్క్ అని అన్నారు. ఆయనతో పోల్చుకోవడం కరెక్ట్ కాదన్నారు. రాజమౌళి అంటే నాకు గౌరవమని కరణ్ జోహార్ వెల్లడించారు. ఒక సినిమాను మరో మూవీతో పోల్చవద్దన్నారు. టాలీవుడ్ మూవీ మిరాయ్ ఈవెంట్‌కు హాజరైన ఆయన.. దర్శకధీరుడిపై ప్రశంసలు కురిపించారు. రాజమౌళి సార్ ఒక మాస్టర్ అయితే.. మేమంతా ఆయన దగ్గర నేర్చుకునే శిష్యులమని కరణ్ జోహార్ అన్నారు. కాగా.. తేజ సజ్జా ప్రధాన పాత్రలో విజువల్ వండర్ మూవీ మిరాయ్. ఇప్పటికే ట్రైలర్ రిలీజ్ కాగా.. అభిమానుల్లో అంచనాలు పెంచేసింది. ఈ మూవీలో టాలీవుడ్ హీరో మంచు మనోజ్ విలన్ పాత్రలో మెప్పించనున్నారు. ఈ మూవీలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. శ్రియా శరణ్ కీలక పాత్రలో కనిపించనుంది.ఈ మూవీని కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కించారు. టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది.




## నా కూతురు చూసే సినిమాలు
# ఇప్పటివరకు చేయలేదు
## ఆలియా భట్

బాలీవుడ్ నటి ఆలియా భట్ ఒకవైపు సినిమాలు చేస్తునే మరోవైపు తన కూతురు రాహాతో సమయం గడపడమే కాకుండా తన గురించి ఆసక్తికరమైన విషయాలను సోషల్ మీడియాలో పంచుకుంటూ ఉంటుంది. అయితే తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ అమ్మడు తన సినిమాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో ఏదీ కూడా నా కూతురు చూసేలా లేదని ఆలియా తెలిపింది. స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ నుంచి మొదలుకొని, గల్లీ బాయ్, గంగూబాయి కతియావాడి, రాకీ ఔర్ రాణి కి ప్రేమ్ కహానీ వంటి సినిమాలు నా కూతురు చూసేటంత వయసులో లేదు. తన కోసం కొత్తగా సినిమాలు చేయాలి. తాను నవ్వుకునే సినిమాలు చేయాలని అనుకుంటున్నాను అంటూ ఆలియా తెలిపింది. అంతేగాకుంగా.. తన భర్త నటించిన 'బర్ఫీ' సినిమా రాహా చూడగలిగేలాగా ఉంటుందని.. ఆ చిత్రం సరదాగా.. సున్నితంగా ఉంటుందని తెలిపింది. ఆలియా సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం 'లవ్ అండ్ వార్' అనే సినిమాలో తన భర్త రణబీర్ కపూర్‌తో నటిస్తుంది. ఈ సినిమా విక్కీ కౌశల్ కీలక పాత్రలో నటిస్తుండగా.. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహిస్తున్నాడు.

# ఓటీటీలోకి బకాసుర రెస్టారెంట్..

చిన్న సినిమాగా వచ్చి థియేటర్లో మంచి విజయం అందుకున్న 'బకాసుర రెస్టారెంట్' చిత్రం తాజాగా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక సన్‌నెక్స్ట్‌లో ఈ సినిమా సెప్టెంబర్ 12 నుంచి తెలుగుతో పాటు తమిళం భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ప్రముఖ కమెడియన్‌లు ప్రవీణ్ వైవా హర్ష ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటించగా.. ఎస్‌జే శివ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అయ్యాడు. ఈ చిత్రాన్ని ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి ఈ సినిమాను నిర్మించారు. కామెడీ ఎంటర్‌టైనింగ్‌గా వచ్చిన ఈ సినిమాలో షైనింగ్ ఫణి (బమ్‌చిక్ బంటి), కేజీఎఫ్ గరుడ రామ్, కృష్ణభగవాన్, శ్రీకాంత్ అయ్యంగార్, ఉప్పెన జయకృష్ణ, వివేక్ దండు, అమర్, రామ్‌పటాస్, రమ్య, ప్రాచీ ఠాకూర్, జబర్దస్త్ అప్పారావు తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన పరమేశ్వర్ (ప్రవీణ్) తన నలుగురు స్నేహితులతో కలిసి ఒకే రూమ్‌లో ఉంటూ జీవనం సాగిస్తుంటాడు. తనకు ఇష్టం లేకపోయినా డబ్బుల కోసం ఉద్యోగం చేస్తుంటాడు.



అయితే ఎలాగైనా ఒక రెస్టారెంట్ పెట్టాలనేది పరమేశ్వర్ కల. ఒకసారి తన స్నేహితులతో ఈ విషయం చెప్పగా.. డబ్బుల కోసం యూట్యూబ్‌లో దెయ్యాల వీడియోలు చేద్దామని సలహా ఇస్తారు. అనుకున్నట్లుగానే వాళ్ళు చేసిన మొదటి వీడియో బాగా వైరల్ అవుతుంది. రెండో వీడియో కోసం ఒక పాడు బడిన బంగ్లాకి వెళతారు. అక్కడ వారికి ఒక మంత్రాలతో ఉన్న పుస్తకం దొరుకుతుంది. దీంతో దానిని వెంటబెట్టి రూమ్‌కి తెచ్చుకుంటారు. ఈ పుస్తకంలో ఉన్నట్లుగా మంత్ర పూజ చేయగా, 200 ఏళ్ల నాటి ఆత్మ ఒక నిమ్మకాయలోకి వస్తుంది. ఆ ఆత్మకు విపరీతమైన ఆకలి.



# టాలీవుడ్‌కు స్టార్ డైరెక్టర్లను
# అందించిన గురువులు

**జన్మనిచ్చిన అమ్మా, నాన్నల తర్వాత మన జీవితంలో అంతటి ప్రాముఖ్యత ఉన్న వ్యక్తి ఆయన ఒక్కరే. తల్లిదండ్రులు మనల్ని పెంచి పోషిస్తే.. మనకు జీవిత పాఠాలు నేర్పేది మాత్రం గురువులే. అది ఏ రంగమైనా సరే గురువు లేకుండా మనం సక్సెస్ అవ్వడం చాలా అరుదు. ముఖ్యంగా టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో గురువుల సాయంతో స్టార్ డైరెక్టర్ స్థాయికి ఎదిగిన ఎంతో మంది ఉన్నారు. ఈ రోజు గురు పూజోత్సవం సందర్భంగా మన తెలుగు సినీ దర్శక గురువుల గురించి తెలుసుకుందాం.**

తన డైరెక్షన్‌తో ఓ మార్క్ వేశారు క్రియేట్ చేశారు సుకుమార్. 'ఆర్య' చిత్రం కోసం తొలిసారి మెగాఫోన్ పట్టిన ఈ స్టార్ డైరెక్టర్.. తన తొలి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించారు. తన మాస్టర్ స్క్రీన్ ప్లేతో సరికొత్త కథలను తెరకెక్కిస్తూ ఇండస్ట్రీలో రాణించారు. 'పుష్ప: ది రైజ్ ' తో పాన్ ఇండియా స్థాయిలో రికార్డ్ క్రియేట్ చేశారు. అల్లు అర్జున్‌కు నేషనల్ అవార్డు దక్కడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే సుకుమార్ శిష్యులు కూడా తమ సినిమాలతో ప్రేక్షకులను మెప్పించారు. సుకుమార్ రైటింగ్స్ అనే బ్యానర్ ద్వారా వారిని సపోర్ట్ చేస్తూ అండగా నిలిచారు. ఆయన స్కూల్ నుంచి వచ్చినవారందరూ ఇప్పుడు స్టార్ డైరెక్టర్లుగా స్థిరపడుతున్నారు.

**స్టార్ డైరెక్టర్లుగా సుకుమార్ శిష్యులు**

'ఉప్పెన' సినిమాతో డైరెక్టర్‌గా పరిచయమైన బుచ్చిబాబు సనా.. మెగా మేనల్లుడితో కలసి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్‌తో పాటు జాతీయ అవార్డును కూడా అందుకున్నాడు. సుకుమార్‌కు ఆయన ప్రియ శిష్యుడు. ఈ క్రమంలోనే తన సొంత బ్యానర్‌లో డైరెక్టర్‌గా లాంఛ్ చేశారు. ప్రస్తుతం మెగా హీరో రామ్ చరమ్‌తో పెద్ది అనే పాన్ ఇండియా సినిమాను తెరకెక్కిస్తున్నారు. టాలీవుడ్‌లో మరో సంచలన డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల. ఈయన కూడా సుకుమార్ శిష్యుడే. 'నాన్నకు ప్రేమతో', 'రంగస్థలం' వంటి చిత్రాలకు పనిచేసిన శ్రీకాంత్.. 'దసరా' చిత్రంతో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టారు. నాని, కీర్తి సురేశ్ హీరోహీరోయిన్లుగా తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్టయ్యింది. ఈ సినిమాతో శ్రీకాంత్ ఓదెల స్టార్ హోదాను సొంతం చేసుకున్నారు. 'కరెంట్ ' సినిమాతో దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయమైన పల్నాటి సూర్య ప్రతాప్ కూడా సుకుమార్ దగ్గర శిష్యరికం చేసినవాడే. ఫస్ట్ సినిమా నిరాశ పరిచినా, గురువు నేతృత్వంలో రెండో సినిమా 'కుమారి 21F'తో మంచి సక్సెస్ అందుకున్నాడు. జక్కా హరి ప్రసాద్ ఎన్నో సినిమాలకు సుక్కుతో కలసి వర్క్ చేశాడు. 100% లవ్ చిత్రానికి స్క్రీన్ ప్లే సమకూర్చిన హరి.. '1 నేనొక్కడినే' సినిమాకు రచయితగా చేశాడు. 'ప్లే బ్యాక్' మూవీతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.


యాంకర్ ప్రదీప్ హీరోగా '30 రోజుల్లో ప్రేమించడం ఎలా?' అనే సినిమా తీసిన దర్శకుడు మున్నా కూడా సుకుమార్ శిష్యుడే. డైరెక్టర్ 'బొమ్మరిల్లు' భాస్కర్ కూడా 'ఆర్య' సినిమాకు సుకుమార్ దగ్గర అసిస్టెంటట్‌గా పనిచేశాడు. 'భమ్ భోలేనాథ్' ఫేమ్ కార్తీక్ దండు కూడా ఆయన దగ్గర శిష్యరికం చేసినవాడే. సుకుమార్ బ్యానర్‌లో సాయి ధరమ్ తేజ్ హీరోగా 'విరూపాక్ష' అనే సినిమా తెరకెక్కించిన విషయం తెలిసిందే. ఇండస్ట్రీలో స్టార్ రైటర్‌గా రాణిస్తోన్న శ్రీకాంత్ విస్సా కూడా సుకుమార్ దగ్గర వర్క్ చేశాడు. పుష్ప, పుష్ప 2, 18 పేజీస్ వంటి సినిమాల స్క్రిప్ట్ విషయంలో సుకుమార్‌కు సపోర్ట్‌గా నిలిచాడు. డెవిల్, టైగర్ నాగేశ్వర రావు సినిమాలకు కూడా ఆయన రైటర్‌గా పనిచేస్తున్నారు.

**ఆర్జీవీ తీర్చిదిద్దిన దర్శకులు..**

అప్పట్లో ఇండియన్ సినిమాను ఓ రేంజ్‌కు తీసుకెళ్లిన ఘనత రామ్ గోపాల్ వర్మదే. ఆయన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఎందరో డైరెక్టర్‌లు బయటకు వచ్చి వాళ్లకంటూ ఒక ప్రత్యేకమైన స్టార్‌డమ్‌ను తెచ్చుకున్నారు. వర్మ శిష్యుల్లో గొప్పగా తెచ్చుకున్న వాళ్లలో కృష్ణవంశీ, తేజ, పూరి జగన్నాథ్, గుణశేఖర్, శివనాగేశ్వరరావు, నివాస్, అజయ్ భూపతి, జీవన్ రెడ్డి, హరీశ్ శంకర్, జేడీ చక్రవర్తి, బాలీవుడ్ నుంచి అనురాగ్ కశ్యప్, బాలీవుడ్ అగ్రదర్శకుడు మధుర్ బండార్కర్ ఉన్నారు. వర్మ ఫిలిం ఫ్యాక్టరీ పేరుతో ఆర్జీవీ బోలెడంత మందిని తన శిష్యులుగా తయారు చేసి వారికి లైఫ్ ఇచ్చిన విషయం తెలిసిందే.

**చిరంజీవి- విశ్వనాథ్- కమల్ హాసన్ గురు శిష్యుల బంధం..**

తెలుగు సినిమా స్థాయిని శిఖరాగ్రానికి చేర్చి.. తన ప్రతి సినిమాతో జాతీయ అవార్డులు సొంతం చేసుకున్న దర్శకులు విశ్వనాథ్‌కు మెగాస్టార్ చిరంజీవికి మధ్య గురు శిష్యుల సంబంధం ఉన్న విషయం అందరికి తెలిసిందే. విశ్వనాథ్ దర్శకత్వంలో చిరు నటించిన శుభలేఖ, ఆపద్బాంధవుడు, రుద్రవీణ, స్వయంకృషి, వంటి సినిమాలు మెగాస్టార్ కెరియర్‌లో మైలురాయిగా సుస్థిరస్థానం సంపాదించుకున్నాయి. మెగాస్టార్ మాస్ హీరోగా మాత్రమే కాదు, ఫ్యామిలీ అండ్ క్లాసికల్ సినిమాలలో సైతం అద్భుతంగా నటించి ఏ సినిమాకు అయినా వన్నె తేగలరు అని నిరూపించాయి వారి కాంబినేషన్ లో వచ్చిన సినిమాలు. ఇప్పటికీ కూడా ఒక క్లాసిక్‌గా నిలుస్తాయనడంలో సందేహం ఉండదు. అలాగే కె.విశ్వనాథ్ ప్రముఖ కథానాయకుడు కమల్‌హాసన్ మధ్య గురు శిష్యుల బంధం ఉంది. ఈ ఇద్దరి కలయికలో ఎప్పటికీ గుర్తుండిపోయే సాగర సంగమం, శుభ సంకల్పం చిత్రాలొచ్చాయి. కె.విశ్వనాథ్ జీవించి ఉన్న రోజుల్లో ఆయనతో కొంత సమయం గడిపేవారు కమల్‌హాసన్.. మరో దిగ్గజ దర్శకుడు కె బాల చందర్ కూడా కమల్‌కు గురువే.. వీరిద్దరి కాంబినేషన్‌లో ఎన్నో సినిమాలు వచ్చాయి.



# లగ్జరీ ఫ్లాట్ అమ్మేసిన బాలీవుడ్ బ్యూటీ..

బాలీవుడ్ బ్యూటీ మలైకా అరోరా లగ్జరీ ఫ్లాట్ అమ్మేసింది. ముంబైలోని అంధేరీ వెస్ట్‌లో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌ను గత నెలలో విక్రయించింది. దాదాపు 182 గజాల వైశాల్యంలో ఉన్న తన ఫ్లాట్‌ను రూ.5.30 కోట్లకు అమ్మింది. గతంలో అంటే 2018లో మలైకా ఇదే ఫ్లాట్‌ను రూ.3.26 కోట్లకు కొనుగోలు చేసింది. ఇప్పుడు ఐదున్నర కోట్లకు విక్రయించింది. అంటే దాదాపు రెండు కోట్ల మేర లాభాలను ఆర్జించింది.

## సినిమా

సినిమాల విషయానికి వస్తే.. మలైకా అరోరా చయ్య చయ్య పాటతో సెన్సేషనల్ అయింది. హిందీలో అనేక స్పెషల్ సాంగ్స్‌లో తళుక్కుమన్న ఆమె తెలుగులో కెవ్వు కేక, రాత్రైన నాకు ఓకే వంటి ఐటం సాంగ్స్‌తో అలరించింది. బుల్లితెరపై జలక్ దిక్‌లాజా, ఇండియాస్ గాట్ టాలెంట్, ఇండియాస్ బెస్ట్ డ్యాన్సర్ వంటి రియాలిటీ షోలకు జడ్జిగానూ వ్యవహరించింది.

## థామాలో స్పెషల్ సాంగ్

ప్రస్తుతం రష్మిక మందన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న థామ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఆయుష్మాన్ ఖురానా ప్రధానపాత్ర పోషిస్తున్నాడు. మ్యాడ్‌డాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా వచ్చిన 'స్త్రీ' యూనివర్స్‌లో నాలుగో చిత్రంగా 'థామా' తెరకెక్కుతోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com